
ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కలీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

శుక్రవారం | 06 నవంబరు, 2026 | పేజీలు : 08

సిపిఐ నేతల అక్రమ అరెస్టులను ప్రతిఘటిస్తాం



సిపిఐ రాష్ట్ర కార్య వర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి

వివరాలు మెయిన్‌లో...

ఆరుతడికి ఆసక్తి చూపని రైతన్న



యాసంగిలోనూ వరి వైపే మొగ్గు

ప్రజాపక్షం /గంగాధర : యాసంగి పంటల సాగుకు సమయం సమీపిస్తుండడంతో గంగాధర మండల రైతులు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. ప్రభుత్వం, వ్యవసాయ శాఖ అధికారులు ఎల్ నినో ప్రభావంతో వరి వద్దు అని హెచ్చరిస్తున్నా రైతులు మాత్రం యాసంగిలోనూ వరి సాగుకే మొగ్గు చూపుతున్నారు. మండలంలో సాధారణ యాసంగి వరి సాగు విస్తీర్ణం 12 నుంచి 15 వేల ఎకరాలు కాగా ఈ ఏడాది కూడా అదే స్థాయిలో సాగు అయ్యే అవకాశం కనిపిస్తోంది. ఖరీఫ్ వరి కోతలు ఇంకా పూర్తి కానేలేదు. అప్పుడే మండలంలోని పలు గ్రామాల్లో రైతులు నారుమడులకు దుక్కులు దున్నుతున్నారు. తక్కువ కాలపరిమితి కలిగిన వరి రకాల విత్తనాలు సిద్ధం చేసుకుంటున్నారు.

వరిసాగులో నీటి లక్ష్యతే కీలకం



యాసంగిలో వరి సాగు చేయాలంటే నీటి లభ్యత అత్యంత కీలకమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. చెరువులు, కుంటల్లో సరిపడా నీరు లేకపోవడం, బోరు బావుల్లో భూగర్భ జలాలు అడుగంటడం, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు వంటి సమస్యలు ఎదురైతే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. ముఖ్యంగా నాట్లు వేసిన తర్వాత నీటి కొరత వస్తే పెట్టుబడి మొత్తం వృధా అవుతుంది. ఎల్ నినోపై అందోళన వాతావరణంలో చోటు చేసుకునే మార్పులు వ్యవసాయంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. ఎల్ నినో పరిస్థితులు ఏర్పడినప్పుడు వర్ష పాతం, ఉష్ణోగ్రతలు, నీటి లభ్యతలో మార్పులు వస్తాయి. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ అధికారులు తక్కువ నీటితో పండే పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచిస్తున్నారు. వేసవిలో ఉష్ణోగ్రతలు పెరిగి బోర్లు ఎండిపోయి తాగునీటికి కూడా ఇబ్బంది వస్తుందని హెచ్చరిస్తున్నారు.

ప్రత్యామ్నాయ పంటలపై ఆసక్తి చూపని రైతులు


వరికి బదులు మొక్కజొన్న, జొన్న, శనగ, పెసర, మినుము, సన్‌ఫ్లవర్, వేరుశనగ, నువ్వులు, కూరగాయ పంటలు వేసి ఆర్థికంగా లాభపడాలని స్వయంగా సిఎం రేవంత్ రెడ్డి సూచిస్తున్నా రైతులు పట్టించుకోవడం లేదు. దీనికి కారణం మార్కెట్ భరోసా లేకపోవడమే. రైతులు చెబుతున్న ప్రకారం గత ఏడాది మొక్కజొన్నకు క్వింటాలుకు రూ.2 వేలు కూడా రాలేదు. ఆరుతడి పంటలకు కోతులు, అడవి పందుల బెడద ఎక్కువ. తెగుళ్లు ఎక్కువ. వరి అయితే ఎకరాకు 25 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి వచ్చి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధర వస్తుందనే నమ్మకం ఉంది. ఆశించిన దిగుబడి, అమ్మకపు భరోసా ఉండడంతోనే వరి వైపే మొగ్గు చూపుతున్నారు.

భరోసా కల్పించేది ఎవరు?

ఒకవైపు ఎల్ నినో ప్రభావంపై ఆందోళన మరోవైపు వరి సాగుపై రైతుల ఆసక్తి ఈ రెండింటి మధ్య యాసంగి వ్యవసాయ సాగుతోంది. కేవలం సూచనలు, అంక్షలతో పంటల సాగు సరళిని మార్చడం సాధ్యం కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రైతులకు గిట్టుబాటు ధర, మార్కెట్ భరోసా, సాగునీటి భద్రత కల్పించినప్పుడే పంటల మార్పిడి సాధ్యమవుతుందని అనుభవజ్ఞులైన రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం ఆరుతడి పంటలకు ప్రత్యేక బోనస్, ఉచిత విత్తనాలు, మార్కెట్ సౌకర్యం కల్పిస్తేనే రైతులు మారుతారని రైతు సంఘాల నేతలు సూచిస్తున్నారు. లేకుంటే ఎల్‌నినో హెచ్చరికలు ఒకవైపు వరి సాగు పట్టుదల మరోవైపు అన్నట్లుగా యాసంగి సాగు కొనసాగడం ఖాయంగా కనిపిస్తోంది.

రైతులు ఆరుతడి పంటలు వేయడం మంచిది

కురిక్యాల, గంగధర ఎఇఒ వెంకట్



మండలంలోని రైతులు యాసంగిలో వరిసాగుకు బదులు ఆరుతడి పంటలు వేయడం మంచిది. ఎల్‌నినో ప్రభావంతో నీటి కొరత ఉంటుంది. భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. వరికి బదులు మొక్కజొన్న, పొద్దు తిరుగుడు, నువ్వులు, కూరగాయలు సాగు చేస్తే తక్కువ నీటితో ఎక్కువ లాభం వస్తుంది. దీనిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాము.

రూ. 2 లక్షల విలువైన చపాతీ యంత్రం వితరణ!

గంటకు 500 చపాతీల తయారీ..
విద్యార్థినులకు సకాలంలో నాణ్యమైన ఆహారం

ప్రజాపక్షం/-ముత్తారం : పేద విద్యార్థులకు అండగా నిలవడమే లక్ష్యం గా, విద్యార్థుల సంక్షేమమే ఎజెండాగా తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అడుగులు వేస్తున్నారు. మంత్రి శ్రీధర్ బాబు సారథ్యం, మార్గదర్శకత్వంలో తెలంగాణ రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ స్టేట్ అడిషనల్ డైరెక్టర్ బర్ల రాజు ప్రత్యేక చొరవ,కృషితో ముత్తారం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి రూ.2 లక్షల విలువైన చపాతీ తయారీ యంత్రాన్ని అందించనున్నారు.ఈ యంత్రం గంటకు సుమారు 500 చపాతీలను తయారు చేయగల సామర్థ్యం కలిగి ఉందని బర్ల రాజు తెలిపారు. దీనివల్ల విద్యాలయంలోని విద్యార్థినులకు సకాలంలో నాణ్యమైన ఆహారం అందడంతో పాటు, ఆహార తయారీలో వంట సిబ్బందికి శ్రమ తగ్గి మరింత సౌకర్యం కలగనుంది. విద్యార్థినుల అవసరాలను ముందే గుర్తించి, వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా ప్రత్యేక కృషి చేసిన స్టేట్ అడిషనల్ డైరెక్టర్ బర్ల రాజును మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేకంగా అభినందించారు. పేద విద్యార్థుల సంక్షేమం, విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ చేపడుతున్న ఇటువంటి కార్యక్రమాలు ఎంతో అభినందనీయమని స్థానికులు కొనియాడుతున్నారు.ఈ కార్యక్రమంలో అడవి శ్రీరాంపూర్ ఉప సర్పంచ్ అసవేన హరిత ,తిరుపతి తో పాటు తదితరులు పాల్గొన్నారు.



దరఖాస్తుల పరిశీలన వేగవంతంగా పూర్తి చేయాలి

ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :
చేయూత పింఛను దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలాల వారీగా చేయూత పింఛను దరఖాస్తుల పరిశీలన వివరాలను సమీక్షించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి,అర్హులైన ప్రతీఒక్కరి పేరు జాబితాలో ఉండేలా చూడాలని ఆదేశించారు. రానున్న రోజుల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. ప్రణాళికబద్ధంగా నీటి సరఫరా జరగాలని, ఎక్కడా నీటి సమస్య రాకూడదని స్పష్టం చేశారు. జిల్లాలోని బోరుబావుల సమాచారాన్ని సేకరించాలని సూచించారు.జిల్లాలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందేలా అధికారులు చొరవ చూపాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఇప్పటివరకు మంజూరైన ఇళ్లు, పూర్తయినవి, నిర్మాణంలో ఉన్న ఇళ్ల వివరాలను ఈ సందర్భంగా సమీక్షించారు. అనంతరం విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో పీఎం శ్రీ పాఠశాలల నిర్వహణపై సమీక్షించారు. పిఎం శ్రీ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని,వారి సామర్థ్యాల పెంపునకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులను క్షేత్రస్థాయి పర్యటనలకు తీసుకెళ్లాలని, జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించాలని తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు రాథోడ్ రమేష్, వెంకట మాధవ రావు,డిఆర్‌డిఒ విజయలక్ష్మి ,ఆర్ అండ్ బి,ఆర్‌డబ్ల్యుఎస్,నీటిపారుదల శాఖల ఇఇలు సుభాష్, సందీప్,అనిల్,డిఇఒభోజన్న,హౌసింగ్ పిడి శ్రీనివాస్,ఇతర అధికారులు,సిబ్బంది, పాల్గొన్నారు.




కలెక్టర్ భవేశ్ మిశ్రా

పూర్వీకుల స్మరణలో సమాధుల వద్ద దీపావళి వేడుకలు

నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు

నగరంలోని 10 స్మశాన వాటికల్లో ముమ్మర ఏర్పాట్లు... సౌకర్యాలు.



ప్రజాపక్షం/కరీంనగర్: విశిష్ట సంప్రదాయం, ఆత్మీయుల జ్ఞాపకాలను వెలుగుల మయం చేస్తూ...కరీంనగర్ ప్రజలు జరుపుకునే దీపావళి 'సమాధుల పండుగ' మానవ సంబంధాలకు, పూర్వీకుల పట్ల ఉన్న గౌరవానికి ప్రతీకగా నిలుస్తోందని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. దీపావళి పండుగ అనగానే ప్రతీ ఇల్లూ ప్రమిదల వెలుగులతో, లక్ష్మీ పూజలు, పిండి వంటలు, బాణసంచా శబ్దాలతో సందడిగా మారుతుంది. కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో దీపావళి వేడుకలకు ఒక ప్రత్యేకమైన, ఆసక్తికరమైన సాంప్రదాయం ఉంది. దశాబ్దాలుగా ఇక్కడ మరణించిన తమ పూర్వీకులను, ఆత్మీయులను స్మరించుకుంటూ స్మశాన వాటికల్లోనే దీపావళి వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. గత ఆరు దశాబ్దాల ఆచార వ్యవహారాల ప్రకారం కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కార్ఖానాగడ్డ, కాశ్మీర్‌గడ్డ, ఆదర్శనగర్, సవరణ్ స్ట్రీట్ ప్రాంతాల్లో ఉన్న హిందూ శ్మశాన వాటికలతో పాటు విలీన గ్రామాల డివిజన్లు అయిన 3 వ డివిజన్ సంతోష్ నగర్, వల్లంపహాడ్ గ్రేవీయార్డు, 19 వ డివిజన్ వెంకటేశ్వర కాలనీ, బెడబుడగ జంగాల గ్రేవీయార్డు తో పాటు 14,16, 18,19, 20,29,26,52 డివిజన్ల పరిదిలోని చింతకుంట, కొత్త పల్లి, మల్కాపూర్, రేకుర్తి, కిసాన్ నగర్, కార్ఖానగడ్డ, కాశ్మీర్ గడ్డ, ఆదర్శనగర్, గోదాంగడ్డ ప్రాంతాల్లో గల ఎస్సీ స్మశాన వాటికల్లో సమాధుల పండుగకు నగర పాలక సంస్థ ద్వారా అత్యంత ఘనంగా ఏర్పాట్లు చేయడం జరుగుతుంది. నగర వ్యాప్తంగా దీపావళి రోజు లక్ష్మి, కేదారేశ్వర వ్రతాలు, దీపాల వెలుగులు, బాణాసంచాల శబ్దాలతో సందడిగా వేడుకలు సాగితే... నగరంలోని సంబంధిత ప్రాంతాల్లో మాత్రం సమాదుల్లో దీపావళి వేడుకలు జరగడం చాలా విశేషం అన్నారు.గతం కంటే ఘనంగా నగరపాలక సంస్థ ద్వారా దీపావళి పర్వదినం వేడుకలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. దీపావళి వేడుకలు నగర ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంత వాతావరణం లో జరుపుకోవాలని మేయర్ పిలుపు నిచ్చారు. నగర ప్రజలందరికి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

నూతన కలెక్టరేట్‌కు మారిన టిఎస్‌జిఎల్‌ఐ జిల్లా కార్యాలయం

ప్రజాపక్షం /కరీంనగర్ టౌన్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ జీవిత భీమా (టిఎస్‌జిఎల్‌ఐ) జిల్లా కార్యాలయాన్ని కరీంనగర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నూతన కలెక్టరేట్ భవనానికి మార్చినట్లు జిల్లా భీమా కార్యాలయ అధికారులు తెలిపారు. ఇకపై కార్యాలయం నూతన కలెక్టరేట్‌లోని రూం నంబర్ 201లో పని చేస్తుందని పేర్కొన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు చెందిన ఉద్యోగులు, పాలసీదారులు టిఎస్‌జిఎల్‌ఐకి సంబంధించిన డెత్ క్లెయిమ్స్, మెచ్యూరిటీ క్లెయిమ్స్, పాలసీల వివరాలు, రుణాలు, ఇతర సేవల కోసం నూతన కలెక్టరేట్ భవనంలో ఉన్న జిల్లా భీమా కార్యాలయాన్ని సంప్రదించాలని అధికారులు కోరారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాపక్షం / గంగాధర : గంగాధర మండల దస్తావేజు లేఖరుల సంఘం ఎన్నికలు గురువారం ఘనంగా జరిగాయి. సీనియర్ రైటర్లు తోట చంద్రయ్య, తాళ్ల అంజయ్య, గంట కిషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికల్లో నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈ ఎన్నికల్లో అధ్యక్షులుగా చెన్నోజుల మునీందర్, ఉపాధ్యక్షులుగా బొద్దుల ప్రతాప్, ప్రధాన కార్యదర్శిగా తాండ్ర రమేశ్, కోశాధికారిగా గంగాధర రాజశేఖర్, ఈసీ మెంబర్లుగా ఇప్పలపల్లి రమణ, తాళ్ల సుధాకర్, బొంగని శ్రీముఖ విజయం సాధించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని సభ్యులు ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మునీందర్ మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి గెలిపించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. సంఘం సభ్యుల సంక్షేమం కోసం సంఘం అభివృద్ధి కోసం అందరితో కలిసి పని చేస్తామని పేర్కొన్నారు.

బైండోవర్ ఉల్లంఘన..

ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారయణపూర్‌కు చెందిన అనరాసి మమత బైండోవర్ ఉల్లంఘించినందుకు ఇరవై వేలు జరిమానా విధించినందుకు ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారి విజెందర్ అన్నారు.గురువారం మీడియా ప్రకటనలో మాట్లాడారు.షరతులు ఎవరైనా ఉల్లంఘించి ప్రవర్తిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.అవసరమైతే పీడియాక్ట్ కేసులు పెడతామని పేర్కొన్నారు.

అనధికారికంగా ఏర్పాటు చేసిన బండ్లను తొలగించండి

మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ చక్రపాణి



ప్రజాపక్షం / రాజన్నసిరిసిల్ల : సిరిసిల్ల పాత బస్టాండ్ సమీపంలోని కెప్టెన్ రఘునందన్ విగ్రహం చుట్టూ అనధికారికంగా ఏర్పాటు చేసిన తోపుడు బండ్లను తొలగించాలని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ చక్రపాణి ఆదేశించారు. పాత బస్టాండ్ ప్రాంతంలో గురువారం మున్సిపల్ కమీషనర్ ఎండి ఖాదీర్ పాషాతో కలిసి పరిశీలించారు. మున్సిపల్ అధికారులు పాదచారులకు ఇబ్బంది కలగకుండా వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పట్టణంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో ట్రాఫిక్‌కు, ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని అన్నారు. అనధికారికంగా రోడ్లపై ఏర్పాటు చేసిన తోపుడు బండ్లు, ఇతర చిరు వ్యాపారుల వల్ల ప్రజా రవాణాకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రజలకు కలకై రవాణా సౌకర్యం అందుబాటులో ఉంచాలని, వ్యాపారులు మున్సిపల్ నిబంధనలను పాటిస్తూ వారి వ్యాపారాలు కొనసాగిస్తూ ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా సహకరించాలని కోరారు. వీరి వెంట స్థానిక కౌన్సిలర్ సభ్యులు బర్రు నారాయణ గౌడ్, బత్తుల రమేశ్, టిపిఓ సాయికృష్ణ, టిపిబిఓలు సల్మాన్, వేణు, సానిటరీ ఇన్స్‌పెక్టర్ కిరణ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

గంగాధర సింగిల్ విండో చైర్మన్ దూలం బాలగౌడ్



ప్రజాపక్షం / గంగాధర : ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం మద్దతు ధర లభిస్తుందని గంగాధర సింగిల్ విండో చైర్మన్ దూలం బాలగౌడ్ అన్నారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు గంగాధర సింగిల్ విండో ఆధ్వర్యంలో కోట్లనరసింహులపల్లి, కొండాయపల్లి, చర్లపల్లి (ఎన్), ఇస్లాంపూర్, మంగపేట, మధురానగర్ ప్యాక్స్ సెంటర్లలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక నాయకులతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలగౌడ్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చిన రైతులు ఇబ్బంది పడకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. తప్ప, తాలు లేకుండా నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చి మద్దతు పొందాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ బెజ్జంకి కళ్యాణ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంత్రి మహేందర్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దుబ్బాసి బుచ్చన్న, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు పురుమల్ల మనోహర్, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు చిరుత మంగ,రాచమల్ల రవి, వేముల భాస్కర్, ఎడవెల్లి విజయ, కాంగ్రెస్ నాయకులు సాగి అజయ్ రావు, రాచమల్ల భాస్కర్, గుజ్జుల బాపురెడ్డి, ఎడవెల్లి శశిధర్ రెడ్డి, అత్తపురం తిరుపతి, కడారి కుమారస్వామి, వేముల అంజి, రేండ్ల రాజిరెడ్డి, వంగల శ్రీధర్, పెంచాల చందు, గంగాధర శ్రీకాంత్, ముచ్చె శంకరయ్య, కార్యకర్తలు, పాల్గొన్నారు.

గండి కొడుతున్న మార్వాడీలపై చర్యలు తీసుకోవాలి

30వ వార్డు కౌన్సిలర్ చంద రాజు

ప్రజాపక్షం / జమ్మికుంట : జమ్మికుంట పట్టణంలో వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న మార్వాడీలతోపాటు అన్ని షాపుల పైన తనిఖీలు నిర్వహించి నిబంధనల ప్రకారం ట్రేడ్ లైసెన్స్ రుసుములు చెల్లించని దుకాణాల యజమానులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జమ్మికుంట మున్సిపల్ కమీషనర్‌కు ఈనెల 2న ఫిర్యాదు చేయడం జరిగింది. తాము కార్యకలాపాలు నిర్వహించే దుకాణాల సముదాయంలో గృహాల కొలతల ప్రకారం ప్రభుత్వానికి లైసెన్స్ రుసుము చెల్లించాల్సిన యజమానులు తప్పుడు సెల్స్ డిక్లరేషన్ పత్రాలు పెట్టి లక్షలాది రూపాయల పన్నులను మున్సిపాలిటీకి చెల్లించకుండా ఎగవేస్తున్నారు. వీరికి స్థానికంగా ఉన్న కొంతమంది రాజకీయ నాయకులు అండగా నిలుస్తూ భరోసా ఇస్తుండడంతో గత కొన్ని సంవత్సరాలుగా జమ్మికుంట మున్సిపాలిటీ ట్రేడ్ లైసెన్స్‌ల రూపంలో రావాల్సిన లక్షలాది రూపాయల నష్టం వాటిల్లింది. ఈ విషయాలన్నింటినీ పరిగణలోకి తీసుకొని 30వ వార్డు పరిధిలోని దుకాణాలపై విచారణ నిర్వహించి ఆయా దుకాణాల కొలతలు తీసుకొని మున్సిపాలిటీకి పన్నులు చెల్లించకుండా నష్టపరిస్తున్న యజమాన్యాలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పన్నులు విధించి పెనాల్టీల రూపంలో మున్సిపాలిటీకి డబ్బులు కట్టించుకోవాలని మున్సిపల్ కమీషనర్‌కి ఫిర్యాదు చేసినట్లు 30వ డివిజన్ కౌన్సిలర్‌చంద రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోకుండా కూడా చాలామంది మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతున్నారు. అలాంటి వారిని సైతం గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం అధికారులపై ఉందని చందా రాజు అన్నారు.

పద్మశాలి భవన నిర్మాణం కోసం రూ.5 కోట్ల నిధులు మంజూరు



ప్రజాపక్షం / కొత్తపల్లి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లోని కోకాపేట రాష్ట్ర పద్మశాలి భవన నిర్మాణం కోసం మంజూరు చేసిన 5 కోట్ల నిధుల ఉత్తర్వులను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ద్వారా రాష్ట్ర పద్మశాలి సంఘం పెద్దలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ గూడూరి శ్రీనివాస్, చేనేత కార్పొరేషన్ చైర్మన్ దూడం వెంకటరమణ, కుడా చైర్మన్ గుండు సుధారాణి, అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షులు కందగట్ల స్వామి, రాష్ట్ర ప్రాంత పద్మశాలి సంఘం అధ్యక్షులు కామార్తాపు మురళి, తెలంగాణ రాష్ట్ర పద్మశాలి రాజకీయ విభాగం అధ్యక్షులు వాసాల రమేశ్, గడ్డం జగన్నాథం, మాచర్ల రామచంద్రం, కరీంనగర్ పద్మశాలి సంఘం అధ్యక్షులు మెతుకు సత్యం, కరీంనగర్ జిల్లా పద్మశాలి సంఘం సంక్షేమ ట్రస్ట్ అధ్యక్షులు స్వర్గం మల్లేశం, కరీంనగర్ జిల్లా పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు స్వర్గం నర్సయ్య, కొత్తపల్లి పట్టణ పద్మశాలి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ వేముల చంద్రశేఖర్, పద్మశాలి కుల బాంధవులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల ప్రారంభమే కాదు.. వెంటనే తూకం వేయాలి

బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు మేచినేని నవీన్ రావు

ప్రజాపక్షం / గంగాధర: రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని దళారులకు అమ్ముకొని నష్టపోతుంటే ప్రభుత్వం మిల్లులు కేటాయించకుండా మొక్కుబడిగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులను మోసం చేస్తుందని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మేచినేని నవీన్ రావు విమర్శించారు. గురువారం గంగాధర మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రారంభించిన అన్ని కొనుగోలు కేంద్రాల్లో వెంటనే తూకం వేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు వేముల దామోదర, రామిడి సురేందర్, జోగు సాగర్, మడ్లపల్లి గంగాధర్, ఎండి నజీర్ హుస్సేన్, శ్రీమల్ల మేఘరాజ్, వడ్లూరి ఆదిమల్లు, నేరెళ్ల అయిలయ్య, బొల్లాడి శ్రీనివాస్ రెడ్డి, ముక్కెర మల్లేశం, పొట్టల కనుకయ్య, మామిడి అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

పుష్కరాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



ప్రజాపక్షం/ధర్మపురి : 2027లో నిర్వహించనున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని ధర్మపురి పట్టణంలో రూ.13 కోట్లతో నూతన రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి తెలిపారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక చొరవతో చేపడుతున్న అభివృద్ధి పనులకు గురువారం ఆమె శంకుస్థాపన చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సహకారంతో పట్టణంలోని 15 వార్డుల్లో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంఘనబట్ల దినేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఐ.రామయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిలుముల లక్ష్మణ్, ఉపాధ్యక్షులు వేముల రాజేష్, దేవస్థానం మాజీ అధ్యక్షులు జక్కు రవీందర్, మున్సిపల్ కౌన్సిలర్లు సంగి ఆనంద్, చీపిరిశెట్టి రాజేష్, సువర్ణ, పవన్, ఇంజనీరింగ్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఇబ్రహింపట్నం విద్యార్థులు

ప్రజాపక్షం /ఇబ్రహీంపట్నం : హైదరాబాద్‌లోని గండిపేటలో గురువారం జరుగుతున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని పి ఎం శ్రీ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన బి. జస్వంత్, ఎం.మహిత్, జె. నందికలు పాల్గొంటున్నట్లు ప్రధానోపాధ్యాయులు రాజన్న తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని హెచ్ఎం రాజన్న ఆకాంక్షించారు.అంతేకాకుండా రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థులను సిద్ధం చేసిన ఫిజికల్ డైరెక్టర్ హెచ్ఎం ప్రత్యేకంగా అభినందించారు.

ఎంపిడిఒ కార్యాలయంలో 'సమయపాలన' ఎక్కడ?

ఆఫీస్‌లో అటెండర్ ఇష్టారాజ్యం
11:30 అయినా రాని వైనం!



ప్రజాపక్షం/ముత్తారం :ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులందరూ నిర్ణీత సమయానికి కార్యాలయాలకు హాజరై ప్రజలకు సేవలు అందించాల్సి ఉంది. స్వయంగా ఎంపీడీవోతో పాటు తోటి కార్యాలయ సిబ్బంది అంతా సమయానికి విధులకు హాజరవుతుంటే, ఇక్కడ పనిచేస్తున్న ఒక అటెండర్ మాత్రం సమయపాలనను తుంగలో తొక్కుతూ తన ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో పనిచేస్తున్న అటెండర్ 'అఖిలేష్' సమయపాలనను తుంగలో తొక్కుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. గురువారం ఉదయం 11:30 గంటలవుతున్నా ఆయన విధులకు హాజరుకాకుండా, బేగంపేట ఎక్స్ రోడ్ వద్ద బస్సు కోసం వేచి చూస్తూ 'ప్రజాపక్షం' కెమెరాకు చిక్కారు. ఎంపీడీవోతో పాటు తోటి సిబ్బంది అంతా సకాలంలో విధులకు హాజరవుతుంటే,అటెండర్ మాత్రం నిత్యం ఆలస్యంగా వస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు.

ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం సూపరింటెండెంట్ సురేష్ : ఈ విషయమై కార్యాలయ సూపరింటెండెంట్ సురేష్‌ను వివరణ కోరగా.. అఖిలేష్ తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఇదివరకే పలుమార్లు హెచ్చరించినా అతని ప్రవర్తనలో మార్పు రాలేదని, విధుపట్ల తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాడని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై స్పందిస్తూ, సదరు అటెండర్‌పై తక్షణమే జిల్లా ఉన్నతాధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసి, శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకునేలా చూస్తామని స్పష్టం చేశారు. కార్యాలయానికి వచ్చే సామాన్య ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉండాలంటే,ఈ నిర్లక్ష్యపు ఉద్యోగిపై జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని ముత్తారం మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

సిపిఐ నాయకుడు మదునయ్యకు నివాళి



ప్రజాపక్షం/పెద్దపల్లి : గోదావరిఖని లెనిన్ నగర్ సిపిఐ మాజీ శాఖా కార్య దర్శి కామ్రేడ్ ఆసాల మదునయ్య (75) అ నారోగ్యంతో బాధపడుతూ మరణించారు. మదునయ్య మరణం పట్ల సిపిఐ ఎఐటియుసి నాయకులు శ్రద్ధా ంజలి ఘటిస్తూ నివా ళులు అర్పించారు. మదునయ్య పార్థివ దేహంపై నాయకులు పార్టీ పతాకాన్ని కప్పి పూలమా లలు వేసి నివాళులు అర్పించారు. కాగా మదునయ్య అంతిమ యాత్ర సందర్భంగా జిల్లా సిపిఐ కార్యదర్శి కామ్రేడ్ తాండ్ర సదానందం, న గర కార్యదర్శి కనకరాజులు పాడే మోయగ,స్థానిక భాస్కర్ రావు భ వన్ ఆవరణలో మదునయ్య పార్థివ దేహం ఉంచి నాయకులు, కార్య కర్తలు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, సిపిఐ 41 వ డివిజన్ కార్పొరేటర్ మార్కాపూరి సూర్య, గౌతమ్ గోవర్ధన్, బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను,నాయకులు సంకె అశోక్, సిపిఐ నగర సహాయ కార్యదర్శి తాళ్ళపెల్లి మల్లయ్య, శాఖా కార్యదర్శి సిరిసిల్ల మల్లేష్,ఎఐటియుసి ఆఫీస్ కార్యదర్శి తొడుపునూరి రమేశ్ కుమార్, ఉన్నారు.

వరి కోతలు ముమ్మరం..

ప్రజాపక్షం/ముత్తారం : వరి కోతలు పూర్తయి ధాన్యం కుప్పలు వస్తున్నా, ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాల్సిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఇంకా ప్రారంభం కాకపోవడంపై రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే మండల పరిధిలో సుమారుగా 50 శాతం వరకు వరి కోతలు పూర్తయినప్పటికీ, కొనుగోలు కేంద్రాలు తెరుచుకోకపోవడంతో రైతులు తమ పంటను దళారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితిపై బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్ రెడ్డి స్పందిస్తూ, జిల్లా యంత్రాంగం తక్షణమే చేసుకోవాలని డిమాండ్ చేశారు.

మంత్రి అడ్లూరి సమక్షంలో కాంగ్రెస్‌లోకి భారీ చేరికలు



ప్రజాపక్షం/ధర్మపురి : ధర్మపురి మండలంలోని నేరెళ్ల గ్రామంలో బుధవారం సాయంత్రం గ్రామ సర్పంచ్ కాసారపు బాలగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్,బీజేపీ పార్టీలకు చెందిన నాయకులు,కార్యకర్తలు,వివిధ కుల సంఘాల పెద్దలు కలిపి సుమారు 300 మందికి పైగా మంత్రి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి,సంక్షేమ పథకాలపై నమ్మకంతోనే ఇతర పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని తెలిపారు. చేరిన వారందరికీ స్వాగతం పలికారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని, నిరుద్యోగ భృతి, ఉద్యోగాల కల్పన,దళితులకు మూడు ఎకరాల భూమి వంటి హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని విమర్శించారు.బీజేపీ నాయకులు ముందుగా తమ పార్టీ అభ్యర్థులను సిద్ధం చేసుకోవాలని హితవు చెప్పారు.ధర్మపురి నియోజకవర్గంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ హయాంలో అనేక అవకతవకలు జరిగాయని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎస్. దినేష్,పార్టీ మండల అధ్యక్షులు చిలుముల లక్ష్మణ్,గ్రామ ప్రజలు,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు,పార్టీలో చేరిన నాయకులు పాల్గొన్నారు.

ఆరుతడి పంటలపై దృష్టి సారించాలి: మల్లేశం



ప్రజాపక్షం /చందుర్తి : ఎల్ నినో ప్రభావం దృష్ట్యా రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించాలని ఆశిరెడ్డి పల్లి గ్రామ సర్పంచ్ బొజ్జ మల్లేశం సూచించారు. గురువారం మండలంలోని ఆశిరెడ్డి పల్లి గ్రామంలో యాసంగి పంట సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారి దుర్గరాజు తెలిపారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా ఉపయోగించుకుంటూ పంటలు వేసుకోవాలని , అవసరం ఉన్న స్థాయిలో నీటి లభ్యత లేని ప్రాంతాల్లో క్రాప్ హాలిడే అంశాన్ని పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రాధ , ఉప సర్పంచ్ మహేందర్ , ఫ్యాక్స్ డైరెక్టర్ మహేందర్ ,ఎఇఒ ప్రవీణ్ ,కార్యదర్శి మహేష్ , విద్యుత్ శాఖ , వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌జిఎఫ్ క్రీడల్లో తేజస్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాపక్షం / కొత్తపల్లి : పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వ హించిన ఎస్‌జిఎఫ్ అండర్19 జూనియర్ కళాశాలల ఉమ్మడి క రీంనగర్ జిల్లా స్థాయి క్రీడా పోటీలలో తేజస్ డిఫెన్స్ అకాడమీ, జూ నియర్ కళాశాల విద్యార్థులు బాస్కెట్ బాల్, సాఫ్ట్ బాల్ విభాగాల్లో ప్ర తిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బాస్కెట్ బాల్ రాష్ట్రస్థాయికి బాలికల విభాగంలో మణిచంద్రిక, బాలుర విభాగంలో అక్షయ్ ఎంపికయ్యారు. సాఫ్ట్‌బాల్‌లో మాహి అక్షిత్ తేజ, వర్షిత్‌లు ఎంపికైనట్లు చైర్మన్ సిహెచ్ సతీష్ రావు తెలిపారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మౌనిక రావు, ప్రిన్సిపాల్ కిషన్ రెడ్డిలు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

ఉచితంగా ఆల్ ఇన్ వన్ పుస్తకాల పంపిణీ

నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్

ప్రజాపక్షం /కోరుట్ల : పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి మజ్లిస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ అన్నారు. ఆల్ ఇండియా మజ్లిస్ ఎఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఎంఐఎం) పార్టీ అధ్యక్షులు,హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు గురువారం కోరుట్ల పట్టణంలోని గడిబురుజు ఏ.జె.ఎం ఫంక్షన్ హాల్‌లో సాలార్ మిల్లత్, మాజీ ఎంపీ దివంగత సుల్తాన్ సలావుద్దీన్ ఓవైసీ పేరుతో రూపొందించిన ఆల్ ఇన్ వన్ 2026 గైడ్లను పదవ తరగతి విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. అదేవిధంగా 8, 9, 10వ తరగతుల్లో చదువుతున్న విద్యార్థులకు పెన్నులు,నోట్‌బుక్స్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మాజిద్ హుస్సేన్ మాట్లాడుతూ పేద విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో మజ్లిస్ పార్టీ గత 26 సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా ఆల్ ఇన్ వన్ గైడ్లను అందజేస్తోందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ముస్లింల విద్యాభివృద్ధికి, ఉర్దూ భాష పరిరక్షణకు, ఉర్దూ మీడియం పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు ఎంఐఎం పార్టీ విశేషంగా కృషి చేస్తోందన్నారు. అనంతరం కోరుట్ల పట్టణంలో ముస్లింల షాదీఖానా నిర్మాణం పూర్తికాకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, లియాఖాత్ అలీ మొహసిన్,మహమ్మద్ రఫీ,ప్రధాన కార్యదర్శి మహమ్మద్ వాజిద్, కోశాధికారి ముజాహిద్,కోరుట్ల ఎంఐఎం పార్టీ ఐకాన్ అబ్దుల్ రహీం, కలీం,సల్మాన్,నమీర్,హమీద్,నాహిద్,పార్టీ కార్యవర్గ సభ్యులు, పట్టణ పరిసర ప్రాంతాలకు చెందిన పార్టీ నాయకులు,కార్యకర్తలు,పట్టణ ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, సకల సౌకర్యాలు



ప్రజాపక్షం/ముత్తారం : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు కావలసిన అన్ని రకాల సకల సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల పరిధిలోని జిల్లలపల్లి గ్రామ సర్పంచ్ గడ్డం రాజేశం అన్నారు. మండలంలోని జిల్లలపల్లి ప్రభుత్వ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యతను, ఉదయం పూట ఇచ్చే మార్నింగ్ టిఫిన్స్‌ను, పాఠశాలలోని ఇతర మౌలిక వసతులను ఆయన స్వయంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.అనంతరం సర్పంచ్ రాజేశం మాట్లాడుతూ ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవ,కృషితో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రతి రోజూ ఉదయం ఎంతో నాణ్యతతో కూడిన టిఫిన్స్ అందిస్తున్నామని తెలిపారు. కార్పొరేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా ప్రభుత్వ పాఠశాలలు రూపుదిద్దుకుంటున్నాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ఈ వసతులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు,సిబ్బందితో పాటు గ్రామస్తులు,పాల్గొన్నారు.

ఆరు నెలలుగా దరఖాస్తు చేసినా స్పందన కరువు

అక్రమ ఇంటి నంబర్ రద్దు చేయాలి!
మున్సిపల్ కార్యాలయం ముందు బాధితుల ధర్నా
కలెక్టర్ చొరవ కోరుతూ ఆవేదన

ప్రజాపక్షం/సుల్తానాబాద్ : అక్రమంగా ఇంటి నంబర్ మంజూరు చేసి,నకిలీ పత్రాల ఆధారంగా రిజిస్ట్రేషన్లు జరిపారని ఆరోపిస్తూ సుల్తానాబాద్ పట్టణానికి చెందిన పలువురు బాధితులు గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ప్లకార్డులతో ధర్నా నిర్వహించారు. ఆరు నెలల క్రితమే అక్రమ ఇంటి నంబర్‌ను రద్దు చేయాలని దరఖాస్తు చేసినప్పటికీ అధికారులు స్పందించకపోవడంతో నిరసనకు దిగినట్లు తెలిపారు. వెంటనే అక్రమ ఇంటి నంబర్‌ను రద్దు చేసి తమకు న్యాయం చేయాలని, జిల్లా కలెక్టర్ స్వయంగా జోక్యం చేసుకోవాలని వారు డిమాండ్ చేశారు.బాధితులు గరిగే శోభారాణి–శ్రీనివాస్,గరిగే తిరుమల, సాహిత్–సౌమ్య, గాజుల పోచం–సరోజన,గరిగే సృజన్ తదితరులు తెలిపిన వివరాల ప్రకారం, సర్వే నంబర్ 948రూ ...లో తమ మామ కీర్తిశేషులు గరిగే మధురయ్య 33 గుంటల భూమిని కొనుగోలు చేశారని పేర్కొన్నారు. ఆ స్థలాన్ని ఎన్నో సంవత్సరాలుగా పశువుల కొట్టంగా వినియోగిస్తున్నామని తెలిపారు.అయితే 2007లో పట్టణానికి చెందిన రెండో వార్డు కౌన్సిలర్ గాజుల రాజమల్లు తన బావమరిది దొడ్ల శ్రీనివాస్ పేరిట 12 గుంటల భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై 2012లో కోర్టును ఆశ్రయించగా, 2014లో తమకు అనుకూలంగా తీర్పు వెలువడిందని వివరించారు.అయినప్పటికీ 2021లో అదే స్థలానికి సంబంధించి నకిలీ పత్రాలను సృష్టించి తమ పశువుల షెడ్డుపై మున్సిపల్ కార్యాలయం ద్వారా అధికారాన్ని ఉపయోగించి ఇంటి నంబర్ పొందారని ఆరోపించారు. అనంతరం మాజీ మున్సిపల్ చైర్మన్ గాజుల రాజ్యలక్ష్మి పదవీకాలంలో ఆమె కుమారుడు గాజుల హరీష్ పేరిట మరో నాలుగు గుంటలను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించారని కూడా ఆరోపించారు.ఈ అక్రమాలపై ఆరు నెలల క్రితం మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసి ఇంటి నంబర్ రద్దు చేయాలని కోరినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో నిరసనకు దిగాల్సి వచ్చిందన్నారు. ఇకనైనా వెంటనే అక్రమ ఇంటి నంబర్‌ను రద్దు చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ ఆందోళనను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

ధర్నా సందర్భంగా బాధితులుమున్సిపల్ కమిషనర్ రావాలి – మాకు న్యాయం చేయాలి అంటూ నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న మున్సిపల్ కమిషనర్ టి. రమేష్ సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులతో మాట్లాడారు.కమిషనర్ వివరణ.ఈ సందర్భంగా కమిషనర్ టి. రమేష్ మాట్లాడుతూ, అక్రమ ఇంటి నంబర్ వ్యవహారంపై లీగల్ ఒపీనియన్ కోరామని, అది అందిన వెంటనే చట్టపరంగా అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ వివాదాస్పద ఇంటి నంబర్ తన కమిషనర్ పదవీకాలానికి ముందే మంజూరైందని, తాను బాధ్యతలు చేపట్టిన తర్వాత ఈ వ్యవహారం జరగలేదని స్పష్టం చేశారు .చట్టపరమైన అభిప్రాయం వచ్చిన తర్వాత నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

బదిలీపై వెళ్తున్న సివిల్ జడ్జికి ఘన సన్మానం

ప్రజాపక్షం/ధర్మపురి : బదిలీపై వెళ్తున్న ధర్మపురి జూనియర్ సివిల్ జడ్జి వై.జానకిని గురువారం ధర్మపురి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బండెల రమేష్,ప్రధాన కార్యదర్శి రామడుగు రాజేష్ మాట్లాడుతూ జడ్జిగా వై.జానకి అందించిన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు మామిడాల శ్రీకాంత్ కుమార్,అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ ఇమ్మడి శ్రీనివాస్,సీనియర్ న్యాయవాదులు గడ్డం సత్యనారాయణ రెడ్డి,రౌతు రాజేష్,అలుక వినోద్ కుమార్, న్యాయవాదులు బత్తిని ఇంద్రకరణ్,గూడ జితేందర్ రెడ్డి,కస్తూరి శరత్ కుమార్,కలమడుగు కీర్తి,హరిప్రసాద్,పాల్గొన్నారు.

ఎంపి నిధులు మంజూరు


ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట: మండలంలోని బండలింగం పల్లి మాల సంక్షేమ సంఘం నిర్మాణానికి ఎంపి నిధుల నుండి మూడు లక్షల రూపాయలు మంజూరు అయినట్టుగా రాజన్నసిరిసిల్లా జిల్లాబిజెపి జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి,ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతిరెడ్డి అన్నారు. సంఘం బలోపేతానికి తమపార్టీ ఎంతో కృషి చేస్తుందని ప్రకటించారు.అభివృద్ధి పనులకు ఎంపి నిధులు కేటాయించారని వారికి గ్రామ సంఘం సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బాలగౌడ్,మోదుసుశ్రీనివాస్,లహరి,హరికృష్ణ,గ్రామస్థులు ఉన్నారు.

టపాసులతో ప్రజలకు ఇబ్బంది పెట్టొద్దు

ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట: టపకాయలతో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తగా ఉండాలని,అప్రమత్తత అవసరమని టపాకుల నిర్వహకులకు గొల్లపల్లి సర్పంచ్ కొండరమేష్‌గౌడ్ సూచించారు.గురువారం ఆయన గ్రామపంచాయితి కార్యాలయ సిబ్బందితో కలిసివెళ్ళి పరిశీలించారు.ప్రజల రాక పోకలకు ఆటంకం కలుగకుండా,ఏదైన ప్రమాదం సంభవించినప్పుడు అగ్నిప్రమాదక సిబ్బందికి వెంటనే ఫోన్ చేసెవిధంగా జాగ్రత్తలను తీసుకోవాలని చెప్పారు.ప్రజల భద్రతను దృష్టిలో పెట్టుకుని దుకాణాదారులు వ్యవహరించాల్నారు.విక్రయ సమయంలో అప్రమత్తంగా ఉండాలని కొండరమేష్‌గౌడ్ తెలిపారు.

ఆర్‌టిసి కార్మికులపై పెంచిన పని భారాలను తగ్గించాలి

టిఎస్ఆర్‌టిసి స్టాఫ్, ఫెడరేషన్ వినతి



ప్రజాపక్షం/ముత్తారం: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మంథని డిపో పరిధిలోని కార్మికులపై ఇటీవల అదనంగా పెంచిన పని భారాలను వెంటనే తగ్గించాలని టీఎస్ఆర్‌టిసి స్టాఫ్, వర్కర్స్ ఫెడరేషన్ మంథని డిపో కమిటీ డిమాండ్ చేసింది.ఈ మేరకు గురువారం సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పి.ఆంజనేయులు,ఆర్.రాజయ్యల ఆధ్వర్యంలో మంథని డిపో మేనేజర్‌కు ఒక వినతిపత్రాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా ఫెడరేషన్ నాయకులు మాట్లాడుతూ, ఇటీవల విజియల్2, విజిఎల్4,ఎం.ఎస్ డి2, ఎం.ఎస్.డి4 డ్యూటీలను కేవలం సిద్దిపేట రూటోకే పరిమితం చేయకుండా.. కరీంనగర్‌జగిత్యాల, కరీంనగర్‌నిజామాబాద్ రూట్లలో కూడా తిప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.దీనివల్ల ఒక్కో సర్వీసుపై అదనంగా దాదాపు 50 కిలోమీటర్ల మేర డ్రైవర్,కండక్టర్లపై తీవ్రమైన పని భారం పడుతోందని వివరించారు.ఈ అదనపు ప్రయాణం వల్ల కార్మికులు తీవ్ర అలసటకు గురవడమే కాకుండా,మానసిక ఆందోళనకు లోనవుతూ అనారోగ్యం బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.కార్మికుల ప్రయోజనాలను,వారి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నాలుగు సర్వీసుల పరిధిని 500 కిలోమీటర్లకు తగ్గించి, పెంచిన పని భారాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని వారు డిపో మేనేజర్‌ను కోరారు.ఈ సమస్య తీవ్రతను వివరిస్తూ వినతిపత్రం ప్రతులను డిప్యూటీ రీజినల్ మేనేజర్, రీజినల్ మేనేజర్, పెద్దపల్లి జిల్లా కలెక్టర్, స్టాఫ్,వర్కర్స్ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీలకు కూడా పంపినట్లు వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డిపో కమిటీ సభ్యులు,ఆర్‌టిసి కార్మికులు పాల్గొన్నారు.

ఉద్యోగాల భర్తీకి 10న జాబ్ మేళా

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : పెద్దపల్లి జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు కృషి విజ్ఞాన్ ఫెర్టిలైజర్స్ కంపెనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 10వ తేదీ మంగళవారం రోజున జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రాజశేఖర్ గురువారం ఒ క ప్రకటనలో తెలిపారు. సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయం మొదటి అంతస్తు, గది నంబర్ 233, పెద్దకల్వల, పెద్దపల్లిలోని జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో ఉదయం 11 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు, కృషి విజ్ఞాన్ ఫెర్టిలైజర్స్ కంపెనీలో మొత్తం 64 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటిలో 60 సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ పోస్టులు, 4 ఫీల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పోస్టులు ఉన్నాయని తెలిపారు. సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ పోస్టులకు ఇంటర్మీడియట్, డిగ్రీ లేదా డిప్లొమా అర్హత కలిగి ఉండాలని,ఫీల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పోస్టులకు బిఎస్‌సి అగ్రికల్చర్ విద్యార్హత తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ఈ ఉద్యోగాలకు పురుషులు, మహిళలు ఇద్దరూ అర్హులని, ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.10,000 నుంచి రూ.18,000 వరకు జీతంతో పాటు టిఎడిఎ, ఇన్సెంటివ్స్ అందించనున్నట్లు తెలిపారు. ఉద్యోగులకు పెద్దపల్లి జిల్లా పరిధిలోనే పని ప్రదేశం ఉంటుందని వెల్లడించారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ అప్‌డేటెడ్ సివి / రెజ్యూమ్, విద్యార్హతల ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ కాపీలు, అప్‌డేటెడ్ ఆధార్ కార్డు జిరాక్స్, అనుభవ ధ్రువీకరణ పత్రాలు తీసుకొని జాబ్ మేళాకు హాజరై తమ పేర్లను నమోదు చేసుకోవాలనిమరిన్ని వివరాలకు 8985336947, 8121262441 ఫోన్ నంబర్లను సంప్రదించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఎల్ నినో ప్రభావాలపై రైతులకు అవగాహన

ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ : జగిత్యాల జిల్లా కళా బృందం ఆధ్వర్యంలో జగిత్యాల రూరల్ మండలం హబ్సీపూర్ గ్రామంలో ఎల్ నినో ప్రభావాలు, వాతావరణ మార్పులపై రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కళా బృందం సభ్యులు పాటలు, నాటికలు, సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా ఎల్ నినో ప్రభావంతో వాతావరణంలో సంభవించే మార్పులు, వర్షాభావ పరిస్థితులు, వ్యవసాయ రంగంపై వాటి ప్రభావం, రైతులు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా కళా బృందం సభ్యులు మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం కారణంగా ఉష్ణోగ్రతల్లో మార్పులు, వర్షపాతం తగ్గడం, వర్షాలు సకాలంలో కురవకపోవడం వంటి పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని వివరించారు. ఇలాంటి వాతావరణ పరిస్థితులు వ్యవసాయంపై ప్రభావం చూపకుండా రైతులు ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టాలని వారు సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక, సాగు విధానాల్లో మార్పులు



చేసుకోవడం ద్వారా వ్యవసాయ నష్టాలను కొంతవరకు తగ్గించుకోవచ్చని వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ జమున రాజేందర్ మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. వ్యవసాయ శాఖ అధికారులు, ప్రభుత్వం అందించే సూచనలు,సలహాలను పాటిస్తూ సాగు చేపట్టాలని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా పంట నష్టాలను నివారించుకోవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి పల్లవి,వార్డు సభ్యులు,గ్రామ రైతులు,మహిళలు,గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎఐటియుసిపై కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్న సిఐటియు, హెచ్.ఎం.ఎస్‌లు

ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్

ప్రజాపక్షం/పెద్దపల్లి : సింగరేణిలో కార్మికుల నుంచి రూ.50 చందా రికవరీని నిలిపివేయాలని సిఐటియు యాజమాన్యానికి లేఖ రాయడాన్ని ఎఐటియుసి తీవ్రంగా ఖండిస్తుందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, బ్రాంచ్ కార్యదర్శి రంగు శ్రీను పేర్కొన్నారు. గురువారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్ లో జరిగిన ఎఐటియుసి కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ చందా రికవరీపై అక్కసుతో సిఐటియు, హెచ్.ఎం.ఎస్‌లు ఎఐటియుసిపై కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.గుర్తింపు సంఘంగా గెలిచిన ఏ యూనియన్ కైనా మళ్ళీ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేంత వరకు చందా రికవరీ ఉంటుందన్న విషయం ఆ యూనియన్లకు తెలియదా అని ప్రశ్నించారు. గతంలో గుర్తింపు సంఘంగా గెలిచిన టిబిజికెఎస్, ఐఎన్‌టియుసి,ప్రాతినిధ్య సంఘంగా ఉన్న హెచ్.ఎం.ఎస్ లకు చందా రికవరీ కాలేదా అని నిలదీశారు. సింగరేణి పరిరక్షణ కోసం,



కార్మికుల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటాలు, ఉద్యమాలు నిర్వహిస్తు న్న ఎఐటియుసికి కార్మికులు సంతోషంగా చందా ఇస్తున్నారని, దీనిని నిలిపివేయాలని సిఐటియు లేఖ రాయ డం కార్మిక వ్యతిరేక చర్య అని, దుర్మార్గమైన ఆలోచన అని పేర్కొన్నారు. కార్మికులను బతిమిలాడి, అధికారులను గద్దం పట్టుకుని చందా రికవరీ చేస్తున్నారని హెచ్ .ఎం.ఎస్ సోషల్ మీడియాలో పోస్టర్ పెట్టి ప్రచారం చేయడం దుర్మార్గమైన చర్య అని ఖండించారు. చందా విషయంలో అధికారులను గద్దం పట్టకునే అవసరం ఎఐటియుసికి లేదన్నారు. చందా డబ్బులతోనే యూనియన్లు నడుస్తాయన్న సోయి వారికి లేదని, కేవలం కార్మికులను,అధికారులను బ్లాక్ మెయిల్ చేసి హెచ్.ఎం.ఎస్ డబ్బులు వసూలు చేస్తూ పబ్బం గడుపుతున్నారని ఆరోపించారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం యాజమాన్యంపై, ప్రభుత్వంపై పోరాటాలు చేయకుండా ఎఐటియుసిపై అనవసరపు, అవగాహన లేని విమర్శలు చేయడం, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం వల్ల ఉపయోగం లేదని, ఇది కేవలం కార్మికులను తప్పుదోవ పట్టించడమే అవుతుందన్నా రు. ఎఐటియుసి పోరాటాల ఫలితంగానే సింగరేణిలో అనేక హక్కులు సాధించడం వల్ల నేడు కార్మిక వర్గం వాటిని అనుభవిస్తుందన్నారు. గుర్తింపు సంఘం కాలపరిమితి ముగిసినా తిరిగి ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేం త వరకు చందా రికవరీ ఉంటుందన్న విషయం సిఐటియు, హెచ్.ఎం.ఎస్‌లకు తెలియకపోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు.ఈ సమావేశంలో ఎఐటియుసి నా యకులు సిద్దమల్ల రాజు, పొన్నాల వెంకటయ్య,కారంపూరి వెంకన్న,బలుసు రవి,దాసరి అనిల్,ప్రకాష్,రా జయ్య,తదితరులు పాల్గొన్నారు.

ఆరుతడి పంటలే శ్రేయస్కరం

ప్రజాపక్షం/ముత్తారం : పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడ్ గ్రామ పంచాయతీ ఆవరణలో గురువారం రైతులకు ఎల్ నినో ప్రభావం ఆరుతడి పంటల సాగుపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ పోతపెద్ది కవిత కిషన్ రెడ్డి,ఉప సర్పంచ్ దాసరి ప్రశాంత్ గౌడ్,వ్యవసాయ శాఖ అధికారులు మాట్లాడుతూ, రోజురోజుకూ తగ్గిపోతున్న భూగర్భ జలాల దృష్ట్యా రైతులు సంప్రదాయ పంటల కంటే తక్కువ నీటితో ఎక్కువ దిగుబడినిచ్చే ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని సూచించారు. వరి కోతల అనంతరం పొలాల్లో పంట అవశేషాలను కాల్చవద్దని,అలా చేయడం వల్ల నేలలోని మిత్రపురుగులు చనిపోయి భూమి నిస్సారమవుతుందని హెచ్చరించారు. అవశేషాలను భూమిలోనే కుళ్ళబెట్టడం ద్వారా సేంద్రియ కర్బనం పెరిగి భూమి సారవంతం అవుతుందన్నారు. రాబోయే యాసంగిలో ఆధునిక పద్ధతులు పాటించాలని కోరారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు,రైతులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ లక్ష్య సాధనలో యువతదే కీలక పాత్ర

ప్రజాపక్షం /ఇబ్రహీంపట్నం : బిజెవైఎం జిల్లా అధ్యక్షులు ఇట్టేడి రాజు,శేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు,జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బీజేవైఎం ఐటీ సెల్ కన్వీనర్ పుస్తెం మహేందర్ ఆధ్వర్యంలో గురువారం వికసిత్ భారత్ 2047 లక్ష్యంపై యువ సంవాద్ కార్యక్రమాన్ని నిర్వహించారు.2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడంలో యువత కీలక పాత్ర పోషించాలని,నైపుణ్యాలు, నూతన ఆవిష్కరణలు, దేశభక్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశయమైన వికసిత్ భారత్ సంకల్పాన్ని విద్యార్థులు,యువతలోకి తీసుకెళ్లడమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని పలువురు నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆసం సంజీవ్ కుమార్,జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ తీగల శ్రీధర్ రెడ్డి,మండల నాయకులు దొనికేన రాజేందర్,మారుతి,గుండాల సందీప్,అజయ్,అభి, పాల్గొన్నారు.

హోంగార్డులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ చెక్కులు అందజేత

ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ : పోలీస్ శాఖలో విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన హోంగార్డుల సేవలను గుర్తిస్తూ, వారికి ప్రభుత్వం మంజూరు చేసిన రిటైర్మెంట్ బెనిఫిట్స్‌లో భాగంగా హోంగార్డులు నరసింహులు,వెంకయ్యలకు ఒక్కొక్కరికి రూ.1.30 లక్షల చొప్పున మంజూరైన చెక్కులను జిల్లా ఎస్పీఅశోక్ కుమార్ జిల్లా పోలీస్ కార్యాలయంలో అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పిమాట్లాడుతూ పోలీస్ శాఖలో హోంగార్డుల సేవలు ఎంతో విలువైనవని, పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ విధి నిర్వహణలో వారు అందించిన సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం కూడా వారి సంక్షేమానికి పోలీస్ శాఖ ప్రాధాన్యత ఇస్తుందని, ప్రభుత్వం తరఫున వారికి అందాల్సిన ఆర్థిక ప్రయోజనాలు సకాలంలో అందేలా శాఖ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్స్‌పెక్టర్ సైదులు పాల్గొన్నారు.

రాజేశ్వరరావు సేవలకు గుర్తుగా విగ్రహ ఏర్పాటు



ప్రజాపక్షం/మెట్‌పల్లి : మెట్‌పల్లి పట్టణంలోని వెల్లుల్ల రోడ్డులో గల ఖాదీ ఆవరణలో మాజీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిషత్ చైర్మన్, మాజీ ఖాదీ బోర్డు చైర్మన్ స్వర్గీయ కల్వకుంట్ల రాజేశ్వరరావు విగ్రహ ఏర్పాటుకు గురువారం శంకుస్థాపన నిర్వహించారు.ఖాదీ బోర్డు సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంతో విగ్రహ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా నాయకుడు స్వర్గీయ కల్వకుంట్ల రాజేశ్వరరావు జ్ఞాపకార్థం విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో ఖాదీ బోర్డు చైర్మన్,మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, ఖాదీ బోర్డు సభ్యులు, టిపిసిసిడెలిగేట్ కల్వకుంట్ల సుజిత్ రావు,మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్,ఖాదీ,అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

సిఐని కలిసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



ప్రజాపక్షం/ఆర్మూర్ : ఇటీవల ఆర్మూర్ పిఎస్ సిఐగా బాధ్యతలు చేపట్టిన కొండి చంద్రశేఖర్‌రెడ్డిని గురువారం పల్లె గ్రామ సర్పంచ్ పార్దేమ్ మనీషా సంజీవ్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ ఎంపీటీసీ ఎల్క రంజిత్, కార్యదర్శి ఆది శ్రీనివాస్ కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో గంగాధర్, నాయకులు సాయగౌడ్ పాల్గొన్నారు.

పేదలకు ఇందిరమ్మ ఇల్లు ఒక వరం



ప్రజాపక్షం/భీమ్‌గల్ రూరల్ : మండలంలోని పురాణీపేట్ గ్రామంలో నూతనంగా మంజూరైన 8 ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను గురువారం ఎంపీడీఓ సంతోష్‌కుమార్ లబ్ధిదారులకు అందజేసి భూమిపూజ చేసి మాట్లాడారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఒక అద్భుతమైన వరమన్నారు. స్వంతింటి కల నెరవేరుతున్న తరుణంలో లబ్ధిదారులు ఆలస్యం చేయకుండా వెంటనే నిర్మాణ పనులను ప్రారంభించి త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవేందర్, నాయకులు లక్ష్మణ్, అనంతరావు, జనార్ధన్, గోపర్ధన్, సతీష్, లింబాద్రి పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత తప్పనిసరి

ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ : అభివృద్ధి పనుల్లో నాణ్యతకు పద్దపీట వేయాలని, ఎల్‌నినో ప్రభావంతో నీటి ఎద్దడి రానుందని ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండి నీటిని పొదుపుగా వాడాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. గురువారం నగరంలోని 22,25,35 వ డివిజన్లలో రూ. లక్షల విలువైన అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ప్రతి డివిజన్‌కు రూ. 20 లక్షల నిధులతో పాటు, రూ. కోటి రూపాయలతో చేపట్టే ప్రత్యేక అభివృద్ధి పనుల్లో నాణ్యతకు పెద్దపీట వేయాలని అధికారులను ఆదేశించారు. అమృత్ 2.0 యుజిడి పనులను వేగవంతం చేయాలన్నారు. అలాగే ఖిల్లా రామాలయానికి రోప్ వే ఏర్పాటుకు చర్యలు వేగంగా జరుగుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో మేయర్ ఉమా రాణి, కార్పొరేటర్లు వైష్ణవి సుధా, రాజేందర్, సుధీర్, బిజెపి నాయకులు పాల్గొన్నారు.



రిమ్స్ ఆసుపత్రి వరుస ఘటనలపై విచారణ జరపాలి

కార్పొరేట్ మెడికల్ మాఫియా హస్తముందా? ప్రజలు, ప్రజాసంఘాల డిమాండ్



ప్రజాపక్షం/మావల: ఏజెన్సీ పరిధిలోని పేద ప్రజలకు మెరుగైన ఉచిత వైద్య సేవలు అందించాలనే ఉన్నత లక్ష్యంతో ఆదిలాబాద్‌లో ఏర్పాటు చేసిన రాజీవ్ గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆసుపత్రిలో వరుసగా చోటుచేసుకుంటున్న వివాదాస్పద సంఘటనలపై సమగ్ర విచారణ జరిపించాలని ప్రజలు, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. గత 25 ఏళ్లుగా నిరుపేదలకు వైద్య సేవలు అందిస్తున్న ఈ ప్రాంతీయ ఆసుపత్రిలో రోజుకో రకమైన సమస్య వెలుగులోకి రావడమే కాకుండా, రెండు రోజుల క్రితం ఏకంగా అత్యవసర విభాగంలోని వెంటిలేషన్ పరికరాలు అపహరణకు గురికావడం ఆసుపత్రి పర్యవేక్షణా లోపానికి నిదర్శనంగా నిలుస్తోంది. గతంలో ఎంఆర్ఐ స్కానింగ్ యంత్రం నిలిచిపోవడం, గత నెలలో చిన్నపిల్లల వార్డులో షార్ట్ సర్క్యూట్ సంభవించి పసికందు మృతి చెందడం, వార్డుల్లో ఎలుకల స్వైర విహారంతో రోగులకు రక్షణ లేకుండా పోవడం లాంటి ఘటనల వెనుక కార్పొరేట్ మెడికల్ మాఫియా ప్రోద్బలం ఉందా? అనే అనుమానాలు ప్రజల్లో వెల్లువెత్తుతున్నాయి. నిరంతరం నిఘా ఉండే ఆసుపత్రి ప్రాంగణం నుంచి వెంటిలేటర్ భాగాలను దర్జాగా దొంగిలిస్తుంటే అక్కడ ఉన్న సెక్యూరిటీ సిబ్బంది, పోలీస్ అవుట్‌పోస్ట్ సిబ్బంది, ఆసుపత్రి మెడికల్ అధికారుల పర్యవేక్షణ ఏమైనట్లు అని బాధితులు ప్రశ్నిస్తున్నారు. ఇంతటి తీవ్రమైన ఘటనలను బయటకు రాకుండా అధికారులు గోప్యంగా ఉంచేందుకు ప్రయత్నించడం పలు అనుమానాలకు తావిస్తోందని ప్రజాసంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ వైద్య రంగం పూర్తిగా గాడితప్పిందని, అత్యవసర సమయాల్లో ప్రాణాలను కాపాడే వెంటిలేటర్లకే భద్రత లేకపోతే పేద రోగుల పరిస్థితి ఏమిటని నిలదీస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ తక్షణమే చొరవ తీసుకుని ఈ వరుస ఘటనలపై ఉన్నత స్థాయి కమిటీతో సమగ్ర విచారణ జరిపించాలని, దొంగతనాలకు, నిర్లక్ష్యానికి బాధ్యులైన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రిమ్స్‌లో పేదలకు మెరుగైన వైద్యం అందేలా పటిష్టమైన భద్రతా పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

జాతీయ వేదికపై ఆదిలాబాద్ డిఎల్ఎస్ఎ సేవల ప్రస్థానం

న్యాయవాది నిఖిలేష్ తోగరికి జిల్లా న్యాయమూర్తుల ప్రశంసలు



ప్రజాపక్షం/ఆదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందిస్తున్న విశిష్ట న్యాయ సేవలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడం జిల్లా న్యాయవ్యవస్థకు గర్వకారణంగా నిలిచింది. మారుమూల గిరిజన, ఏజెన్సీ ప్రాంతాల ప్రజలకు ఉచిత న్యాయ సహాయం, న్యాయ చైతన్యం, లోక్ అదాలత్‌ల ద్వారా రాజీ మార్గంలో వివాదాల పరిష్కారం వంటి కార్యక్రమాలతో ఆదిలాబాద్ డీఎల్ఎస్ఏ సాధించిన విజయాలను జాతీయ స్థాయి నేషనల్ ఫోరమ్ ఆఫ్ డీఎల్ఎస్ఏలో ప్రదర్శించేందుకు ఎంపిక చేశారు. ఈ విజయ ప్రస్థానంలో వినూత్న సృజనాత్మక ప్రచారానికి కూడా ప్రత్యేక స్థానం లభించింది. న్యాయ సేవల ప్రాముఖ్యతను సామాన్య ప్రజలకు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో రాజీవ్ మార్గమే రాజమార్గం పేరుతో న్యాయవాది నిఖిలేష్ తోగరి ప్రత్యేక గీతాన్ని రచించారు. ఈ పాటకు సంబంధించిన వీడియోను స్వయంగా రూపొందించి, చిత్రీకరణతో పాటు ఎడిటింగ్ కూడా చేపట్టి ఆదిలాబాద్ డీఎల్ఎస్ఏ అందిస్తున్న ఉచిత న్యాయ సహాయం, గిరిజన ప్రాంతాల్లో న్యాయ చైతన్యం, మహిళలు, పిల్లలు, నిరుపేదల హక్కుల పరిరక్షణ, లోక్ అదాలత్‌ల ప్రాధాన్యతలను సృజనాత్మకంగా ఆవిష్కరించారు. ఈ వీడియోను జాతీయ స్థాయి నేషనల్ ఫోరమ్‌లో ప్రదర్శించారు. ఆదిలాబాద్ జిల్లా సేవలకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడంలో భాగస్వామిగా నిలిచిన న్యాయవాది నిఖిలేష్ తోగరిని గురువారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు, గౌరవ న్యాయమూర్తులు హుస్సేన్, రాజ్యలక్ష్మి, బి.సి. శశికుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్ నగేష్ అభినందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా న్యాయవాది నిఖిలేష్ తోగరి మాట్లాడుతూ న్యాయం అనేది ప్రతి సామాన్యుడికి చేరాలని, మారుమూల ఏజెన్సీ ప్రాంతాల ప్రజలకు తమ హక్కులపై అవగాహన కల్పించడంలో సంగీతం, వీడియో వంటి సృజనాత్మక మాధ్యమాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. డీఎల్ఎస్ఏ ప్రజాహిత కార్యక్రమాలకు తన వంతు సహకారం అందించడం గౌరవంగా భావిస్తున్నానన్నారు. డీఎల్ఎస్ ఏకు జాతీయ గుర్తింపు రావడం పట్ల జిల్లా న్యాయవాదులు, కోర్టు సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

యాదవ సమాజాన్ని ఉద్ధరించేందుకే విద్యావంతుల ఐక్య వేదిక

రాష్ట్ర అధ్యక్షుడు చలకని వెంకట్ యాదవ్



ప్రజాపక్షం/ నిజామాబాద్ : యాదవ సమాజాన్ని ఉద్ధరించేందుకే విద్యావంతుల ఐక్యవేదికను ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర అధ్యక్షులు చలకని వెంకట్‌యాదవ్ అన్నారు. గురువారం జిల్లా ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ముందుగా విద్యావంతుల జిల్లా అధ్యక్షురాలిగా దండేమిని మంజుల యాదవ్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్ యాదవ్ మాట్లాడుతూ యాదవ సమాజాన్ని చైతన్యపర్చేందుకు గ్రామ గ్రామాన అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు విద్య ప్రాముఖ్యతను తెలియజేస్తామన్నారు. ఆనాడు తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందంటే అందుకు కారణం విద్యావంతుల వేదిక ఏర్పాటు చేయడమేనని, విద్య ద్వారానే సమాజాభివృద్ధి చెందుతుందని నమ్మి ఈ కార్యక్రమాన్ని పూనుకున్నట్లు తెలిపారు. యాదవ సమాజం అభివృద్ధి చెందాలన్న, రాజకీయంగా రాణించాలన్న ముందుగా సమాజంపై అవగాహన ఉండాలన్నారు. ఎన్ని ఆటంకాలు వచ్చినా వెనకడుగు వేయకుండా జాతిని చైతన్యం చేయటంతో పాటు సంఘ నిర్మాణంతో పాటు విద్యార్థుల అభివృద్ధి విద్యా ఉద్యోగ రంగాల్లో ముందుకు తీసుకెళ్లటంతో ముఖ్యభూమిక పోషిస్తామన్నారు. వైస్‌ప్రెసిడెంట్ బైకన్ మహేష్ యాదవ్, ఎర్రం గణేష్ యాదవ్, గుజ్జ అశోక్‌యాదవ్, రాసగిరి యాదవ్, దినేస్ యాదవ్, స్పోక్స్ పర్సన్ ప్రవీన్ యాదవ్, కోశాధికారి లక్ష్మణ్ యాదవ్, సభ్యులు గంగాధర్ యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, సంజీవ్ యాదవ్, అనూష యాదవ్ పాల్గొన్నారు.

సంకల్పంతో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపు



ప్రజాపక్షం/నేరడిగొండ: వాంకిడి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సంకల్ప కార్యక్రమ పోస్టర్‌ను కాంప్లెక్స్ హెచ్ఎం వివేకానంద్ కుమార్, డీఆర్‌పీ జె.తానాజీ గురువారం ఆవిష్కరించారు. 10 రోజుల కార్యాచరణ ప్రణాళిక ద్వారా తెలుగు, ఇంగ్లీష్, గణితం సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారి ప్రాథమిక సామర్థ్యాలను మెరుగుపరచాలని ఉపాధ్యాయులకు సూచించారు.

ఉచిత కంటి పరీక్ష శిబిరానికి విశేష స్పందన



ప్రజాపక్షం/నేరడిగొండ: కుమారి ప్రాథమిక పాఠశాలలో చేయూత ఫౌండేషన్, ఎల్.వి.ప్రసాద్ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. డాక్టర్ వినయ్ ఆధ్వర్యంలో 80 మందికి కంటి పరీక్షలు చేయగా, 20 మందికి సమస్యలు గుర్తించి మెరుగైన వైద్యం కోసం రెఫర్ చేసినట్లు ఫౌండేషన్ చైర్మన్ డా.ఎన్.టి. రమణ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ అగ్గిమల్ల గోదావరిలస్మన్న, ఉపసర్పంచ్ ఆడెపు రవి, హెచ్ఎం గంగారం పాల్గొన్నారు.

నిలిచిపోయిన పంచాయతీ భవనాల నిర్మాణాలు



ప్రజాపక్షం/నేరడిగొండ: మండలంలో గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలు నిధుల కొరతతో అర్ధాంతరంగా నిలిచిపోయాయి. మెటీరియల్ బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు పనులను పిల్లర్లు, బేస్‌మెంట్ స్థాయిలోనే వదిలేశారు. పూర్తి చేసిన భవనాలకు బిల్లులు రాక కాంట్రాక్టర్లు అవస్థలు పడుతుండగా, నిలిచిన నిర్మాణాల్లో రాడ్లు తుప్పుపట్టి ప్రజాధనం వృథా అవుతోందని ప్రజలు వాపోతున్నారు. స్థల వివాదాలు, నిధుల కొరతను పరిష్కరించి వెంటనే నిర్మాణాలను పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆత్మవిశ్వాసంతోనే ఉన్నత విజయాలు: కలెక్టర్ రాజర్షిషా

ప్రజాపక్షం/మావల: మావల కేజీబీవీలో ఇన్‌స్పైర్ అండ్ ఇగ్నైట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వ్యక్తిత్వ వికాస శిక్షణలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా పాల్గొని విద్యార్థినులకు మార్గదర్శనం చేశారు. విద్యార్థులు చిన్నతనం నుంచే లక్ష్యాలను నిర్దేశించుకుని పట్టుదలతో చదవాలన్నారు. భయం వీడి సానుకూల దృక్పథంతో ముందడుగు వేయాలని సూచించారు. అనంతరం విద్యార్థినుల హెల్త్ ప్రొఫైల్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. డీఈఓ మాధవి, డిఎంహెచ్ఓ సాధన, కేజీబీవీ ఎస్ఓ సువర్ణ పాల్గొన్నారు.



పొగమంచు వేళ అప్రమత్తత అవసరం

ట్రాఫిక్ ఎసిపి శ్రీనివాస్



ప్రజాపక్షం/శ్రీరాంపూర్ఃు చలికాలంలో ఉదయం వేళల్లో పొగమంచు అధికంగా ఉండే దృష్ట్యా వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ అప్రమత్తంగా వాహనాలు నడపాలని ట్రాఫిక్ ఎసిపి శ్రీనివాస్ సూచించారు. గురువారం మంచిర్యాల, శ్రీరాంపూర్, సిసిసస్సూర్, క్యాతనపల్లి, బైపాస్ రోడ్డు, గద్దెరగడి పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక వాహన తనిఖీలు చేపట్టారు. రహదారులపై రాంగ్ పార్కింగ్ చేసిన లారీలు, ఇతర భారీ వాహనాలతో సహా మొత్తం 220కి పైగా వాహనాలను తనిఖీ చేసి, నిబంధనలు ఉల్లంఘించిన వారికి రూ.1,20,000 జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగమంచు వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు స్పష్టంగా కనిపించక రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందన్నారు. వాహనదారులు తమ వాహనాలకు రిఫ్లెక్టివ్ స్టిక్కర్లు అతికించుకోవాలని, హెడ్‌లైట్లు, టెయిల్ లైట్లు, ఇండికేటర్లు సక్రమంగా పనిచేసేలా చూసుకోవాలని పేర్కొన్నారు.ప్రమాదాల నివారణకు తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. ఈ తనిఖీల్లో రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్ రావు, మంచిర్యాల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ హసన్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి పనులపై కౌటాల పంచాయతీ సమీక్ష

ప్రజాపక్షం/కౌటాలఃు గ్రామ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ అవసరమైన పనులను గుర్తించి త్వరితగతిన పూర్తి చేయాలని సర్పంచ్ నక్క శంకర్ అన్నారు. గురువారం కౌటాల గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పంచాయతీ పాలకవర్గం సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ఉపసర్పంచ్ డబ్బా గోపాల్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

ఉద్యాన పంటల రక్షణకు బిందు సేద్యం మేలు

ప్రజాపక్షం / కౌటాలఃు మిర్చి, కూరగాయల పంటల్లో తేమ శాతం తగ్గకుండా ఉండేందుకు రైతులు డ్రిప్, స్ప్రింక్లర్లను వినియోగించాలని ఉద్యానవన శాఖ అధికారి సుప్రజ సూచించారు. గురువారం కౌటాల మండలంలోని గురుడపేట, గుడ్లబోరి గ్రామాల్లో ఆమె పర్యటించి ఉద్యాన పంటలను పరిశీలించారు. ఎల్ నినో ప్రభావం ఉన్నందున నేలలో తేమను కాపాడుకునేందుకు మల్చింగ్ పద్ధతిని పాటించాలని, సమతుల్య ఎరువుల యాజమాన్యానికి డ్రిప్ విధానం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. డ్రిప్, స్ప్రింక్లర్ల ఏర్పాటుకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సబ్సిడీ కోసం దరఖాస్తు చేసుకున్న రైతుల పొలాలను సందర్శించి పంటల పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

నిబంధనలు పాటించని ఆస్పత్రులపై చర్యలు : కలెక్టర్

ప్రజాపక్షం/నిజామాబాద్ ఃు ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించే ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి వైద్యారోగ్య శాఖాధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో గురువారం కలెక్టర్ అధ్యక్షతన క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ అమలుపై సమావేశం జరిగింది. జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రుల రిజిస్ట్రేషన్లు, రెన్యువల్స్‌పై కలెక్టర్ సమీక్షించారు. ప్రతి ఆస్పత్రి తప్పనిసరిగా జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ కింద రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వహణ తీరు పట్ల ప్రత్యేక పర్యవేక్షణ జరుపుతూ నిబంధనలు పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. అన్ని నిబంధనలు పాటించే ఆస్పత్రులకే అనుమతులు, రెన్యువల్స్ చేయాలని సూచించారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ నిబంధనలకనుగుణంగా సదుపాయాలు కలిగి ఉన్న వారికి నిర్ధేశిత గడువులోగా అనుమతులు మంజూరు చేయాలని,ఈ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరగాలని, ఎవరైనా అవకతవకలకు ఆస్కారం కల్పించినట్లు ఫిర్యాదు వస్తే ఎంతమాత్రం ఉపేక్షించబోమని, బాధ్యులైన అధికారులు, సిబ్బందిని ఉద్యోగాల నుండి తొలగించేందుకు కూడా వెనుకాడబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. ఏవైనా ఆస్పత్రులు రిజిస్ట్రేషన్ లేకుండా కొనసాగుతున్నట్లయితే వెంటనే నిర్వాహకులకు నోటీసులు జారీ చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులు అంకిత భావంతో విధులు నిర్వర్తిస్తూ వైద్య వ్యవస్థ ప్రతిష్టను పెంపొందించేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిటీ గవర్నింగ్ కౌన్సిల్ చైర్‌పర్సన్ డాక్టర్ కవితారెడ్డి, అదనపు కలెక్టర్లురాజాగౌడ్, భుజంగరావు, నగరపాలక సంస్థ కమీషనర్ దిలీప్‌కుమార్, జిల్లా వైద్యారోగ్యాధికారిని డాక్టర్ రాజశ్రీ, నిజామాబాద్, బోధన్ ఐఎంఎ శాఖల అధ్యక్షులు డాక్టర్ విశాల్, డాక్టర్ ముకరంజా, అధికారులు పాల్గొన్నారు.

ఆర్మూర్ రాజకీయాల్లో బిసి నేతల వ్యూహంపై ఉత్కంఠ!

ఈరవత్రి రాజశేఖర్, అయ్యప్ప శ్రీనివాస్ తదుపరి అడుగులు ఎటువైపు ?





ప్రజాపక్షం/ఆర్మూర్ ఃు నియోజకవర్గ రాజకీయాల్లో బీసీ నేతల కొత్త రాజకీయ అడుగులు ఆసక్తికర చర్చకు దారి తీస్తున్నాయి. ఈరవత్రి రాజశేఖర్, అయ్యప్ప శ్రీనివాస్‌లు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు రాజకీయంగా తగిన ప్రాతినిధ్యం కల్పించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారనే చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా వినిపిస్తోంది. కేవలం రాజకీయాలనే పరిమితం కాకుండా పేద ప్రజలకు తమకుతోచిన విధంగా సహాయ సహకారాలందిస్తూ ప్రజల మధ్య ఉండేందుకు ఈ నేతలు గట్టిగా ప్రయత్నిస్తున్నారు. ఆపదలో ఉన్న వారికి అండగా నిలవటం, పేద కుటుంబాలకు చేతనైన సాయం చేయడంతో సామాజిక సేవకు ప్రాధాన్యతనిస్తున్నట్లు కనిపిస్తోంది. రాజకీయాల్లో అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పించాలనే అంశం ఇప్పుడు ఆర్మూర్‌లో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల గొంతుకను రాజకీయ వేదికలపై ఈ నేతలు బలంగా వినిపించాలనే ప్రయత్నం ఎంతవరకు ముందుకు సాగుతుందనేది ఆసక్తికరంగా మారింది. అయితే ఈ నేతల రాజకీయ వ్యూహమేమిటి ? వారి ఆలోచనలను వివిధ సామాజిక వర్గాల నుంచి ఎలాంటి స్పందన వస్తుంది ? సామాజిక సేవ రాజకీయ ప్రాతినిధ్యానికి దారి తీస్తుందా ? లేక ఆర్మూర్ రాజకీయాల్లో మరో కొత్త సమీకరణానికి నాంది పలుకుతుందా ? అన్న ప్రశ్నలు స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చకు వస్తున్నాయి. మొత్తానికి పేదలకు అండగా నిలుస్తూ అన్ని వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలనే లక్ష్యంతో సాగుతున్న ఈరవత్రి రాజశేఖర్, అయ్యప్ప శ్రీనివాస్‌ల అడుగులు ఆర్మూర్ రాజకీయాల్లో ఎలాంటి మార్పులకు దారి తీస్తాయో బీసీ నేతల ప్రయత్నాలకు ఆయా సామాజిక వర్గాల ప్రజల నుంచి ఎలాంటి స్పందన లభిస్తుంది ? రానున్న రోజుల్లో ఆర్మూర్ రాజకీయ సమీకరణాలను వీరు ఏ మేరకు ప్రభావితం చేస్తారు ? అన్నది వేచి చూడాల్సిందే.

కమర్షియల్ వ్యాపారంగా కళాశాల ప్రాంగణం

ఎఐఎస్ఎఫ్, ఎఐపిఎస్యు



ప్రజాపక్షం/నిజామాబాద్ ఃు జిల్లా కేంద్రంలోని దుబ్బలోని ప్రభుత్వ గిరిరాజ్ కళాశాల ఆవరణలో కమర్షియల్ పద్ధతిలో క్రికెట్ అకాడమీ నిర్వహిస్తున్న వారిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎఐఎస్ఎఫ్, ఎఐపిఎస్యు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలో క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ నెట్ సదుపాయం కళాశాల విద్యార్థుల క్రీడాభివృద్ధికి ఉపయోగపడాల్సి ఉండగా, కొందరు వ్యక్తులు జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అసోసియేషన్ పేరును వాడుకుని ప్రైవేట్ అకాడమీగా విద్యార్థుల నుండి ఫీజులు వసూలు చేస్తూ కమర్షియల్‌గా నిర్వహించటం ఆందోళన కరమన్నారు.ప్రభుత్వ భూమి, వనరులను వ్యక్తిగత ఆదాయ వనరుగా మార్చటం సరైన విధానం కాదన్నారు. కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా క్రికెట్ శిక్షణ పొందే అవకాశం కల్పించాలని కోరారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థుల ఆర్థిక ఇబ్బందుల కారణంగా క్రీడలకు దూరం కాకుండా ప్రభుత్వం అందించిన సదుపాయాలందరికి సమానంగా అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థి సంఘాల వినతిపై స్పందించిన ప్రిన్సిపాల్, ప్రభుత్వ ఆస్తులను నిబంధనలకు విరుద్ధంగా కమర్షియల్ అవసరాలకు వినియోగిస్తున్నట్లయితే పూర్తిస్థాయిలో విచారణ జరిపి నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రఘురాం, అనిల్, నగేష్, కిషోర్, అనూష నన్ని, రాజేష్, భాను, సోన్‌రాజ్, రాంచరణ్, నీరజ్, రంజిత్, సిద్ధార్థ్ పాల్గొన్నారు.

రైతులకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి



ప్రజాపక్షం / పెంచికలపేట్ఃు రైతులు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందడానికి ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ అన్నారు. గురువారం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలంలోని కొత్మీర్, దుబ్బగూడ గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచ్ సత్యనారాయణ సహకారంతో రైతు పొలాల వద్దే ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. 2019 ఫిబ్రవరి నాటికి పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులకు పిఎం కిసాన్ పథకానికి సంబంధించిన సందేహాలను నివృత్తి చేశారు.

పరీక్ష ఫీజుల దోపిడీ అరికట్టాలి

బచ్చలి ప్రవీణ్ కుమార్



ప్రజాపక్షం / మంచిర్యాలఃు ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో పరీక్ష ఫీజుల పేరుతో అదనపు వసూళ్లు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారని విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షుడు బచ్చలి ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. గురువారం మంచిర్యాలలో ఆయన మాట్లాడుతూ పదో తరగతికి ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు రూ.125 కాగా ప్రైవేట్ పాఠశాలలు రూ.800 నుంచి రూ.1,200 వరకు వసూలు చేస్తున్నాయని తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు రూ.640 నుంచి రూ.890 మాత్రమే ఫీజు ఉండగా, ప్రైవేట్ కళాశాలలు రూ.2,000 నుంచి రూ.3,000 వరకు దండుకుంటున్నాయని పేర్కొన్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. విద్యాశాఖ, ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని, అధికారిక ఫీజుల వివరాలను నోటీసు బోర్డుల్లో ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదనంగా వసూలు చేసిన మొత్తాన్ని వెంటనే వెనక్కి ఇప్పించి, నిబంధనలు ఉల్లంఘించిన యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ఎరువుల విక్రయాల్లో అక్రమాలకు తావులేదు

ఎడిఎ మామిడి కృష్ణ



ప్రజాపక్షం /మందమర్రిఃు ఎరువుల విక్రయాల్లో నిబంధనలు పాటించకుండా అక్రమాలకు పాల్పడితే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని మంచిర్యాల సహాయ వ్యవసాయ సంచాలకుడు మామిడి కృష్ణ హెచ్చరించారు. గురువారం మండల వ్యవసాయ అధికారి జి. కిరణ్మయితో కలిసి మందమర్రి, పులిమడుగు గ్రామాల్లోని ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్కులు, నిల్వలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లు ప్రతిరోజూ స్టాక్ బోర్డుపై నిల్వల వివరాలు ప్రదర్శించాలని, రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు. ఇ పాస్ యంత్రంలోని లెక్కలకు, దుకాణంలోని వాస్తవ నిల్వలకు తేడాలు ఉండకూడదన్నారు. రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించినా, ఎక్కువ ధరలకు విక్రయించినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో మండల వ్యవసాయ అధికారి జి. కిరణ్మయి పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్‌లో రాష్ట్రస్థాయికి వరుణ్ తేజ్



ప్రజాపక్షం / మందమర్రిఃు బాస్కెట్‌బాల్ క్రీడలో అద్భుత ప్రతిభ కనబరిచిన మందమర్రి పిఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థి కండె వరుణ్ తేజ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న వరుణ్ తేజ్ అండర్14 విభాగంలో ఈ ఘనత సాధించాడు. బుధవారం నిర్మల్‌లో నిర్వహించిన జోనల్ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో అత్యుత్తమ ఆటతీరు ప్రదర్శించి రాష్ట్రస్థాయికి అర్హత సాధించాడు. ఈ నెల 13న కరీంనగర్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో వరుణ్ తేజ్ పాల్గొనున్నాడు. ఈ సందర్భంగా విద్యార్థిని పాఠశాల ప్రిన్సిపాల్ సారా తస్నీమ్, పిఇటి ఎం. చిన్నక్క అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ రాణించి పాఠశాలకు, ప్రాంతానికి మంచి పేరు తేవాలని వారు ఆకాంక్షించారు.

పల్లెలకు దూరంగా పాలన.. ప్రజలకు తీరని వేదన!

జైనూర్ కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటే ప్రజా ఆకాంక్ష, నాలుగు మండలాల ప్రజలకు తప్పని 80 కిలోమీటర్ల ప్రయాణ భారం

ప్రజాపక్షం / జైనూర్: జైనూర్ కేంద్రంగా కొత్త రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఏజెన్సీ ప్రాంతంలో బలంగా వినిపిస్తోంది. జైనూర్, లింగాపూర్, సిర్పూర్ (యు), కేరమెరి మండలాల ప్రజలకు పాలనా సేవలు చేరువ చేయాలంటే జైనూర్‌ను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించడమే సరైన మార్గమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. చిన్నపాటి ధ్రువీకరణ పత్రాల నుంచి భూ సమస్యల పరిష్కారం వరకు ప్రతీ పనికీ జిల్లా కేంద్రం ఆసిఫాబాద్‌కు వెళ్లాల్సి వస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా లింగాపూర్ నుంచి సుమారు 80 కిలోమీటర్ల ప్రయాణించాల్సి రావడం సామాన్యులకు భారంగా మారింది. ఈ నేపథ్యంలో పాలనా వికేంద్రీకరణ ద్వారా ఏజెన్సీ ప్రజలకు ఉపశమనం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. భౌగోళికంగా పరిశీలిస్తే జైనూర్ నాలుగు మండలాల ప్రజలకు అనుకూలమైన కేంద్రంగా ఉంది. జైనూర్, లింగాపూర్, సిర్పూర్ (యు), కేరమెరి మండలాల పరిధిలోని మారుమూల గ్రామాలు, గూడేలకు ఇక్కడి నుంచి రాకపోకలు సాగించడం సౌకర్యంగా ఉంటుంది. ఏజెన్సీ ప్రాంతంలోని కొండలు, వాగులు, మారుమూల ఆవాసాల మధ్య నివసించే ప్రజలకు జిల్లా కేంద్రం కంటే జైనూర్ చేరుకోవడం అనుకూలంగా ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇక్కడ రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసి ఆర్డిఓ కార్యాలయం అందుబాటులోకి తీసుకొస్తే నాలుగు మండలాల ప్రజలకు పాలనా సేవలు మరింత చేరువయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం నాలుగు మండలాల ప్రజలు రెవెన్యూ సంబంధిత పనుల కోసం జిల్లా కేంద్రం ఆసిఫాబాద్‌కు వెళ్లాల్సి వస్తోంది. ధ్రువీకరణ పత్రాలు, భూ రికార్డులు, సరిహద్దు వివాదాలు, ఇతర రెవెన్యూ వ్యవహారాల కోసం సుదూర ప్రయాణాలు తప్పడం లేదు. ముఖ్యంగా లింగాపూర్ మండలంలోని మారుమూల గ్రామాల నుంచి ఆసిఫాబాద్‌కు సుమారు 80 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోంది. ఉదయం బయలుదేరి పనులు ముగించుకొని తిరిగి గ్రామాలకు చేరుకునేలోగా రోజంతా గడిచిపోతోంది. కొన్ని సందర్భాల్లో ఒకే పని కోసం పలుమార్లు జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వస్తోందని స్థానికులు చెబుతున్నారు. దీంతో కూలీ పనులు చేసుకునే నిరుపేదలు, రైతులు, వృద్ధులు, మహిళలు రవాణా ఖర్చులతో పాటు సమయాన్ని కూడా కోల్పోతున్నారు.వికేంద్రీకరణతోనే సమస్యలకు పరిష్కారం.. ప్రజాప్రతినిధుల చొరవ కీలకంజైనూర్‌లో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తే ప్రజల ప్రయాణ భారం తగ్గడంతో పాటు పాలనా సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. రెవెన్యూ అధికారుల పరిధిలోని సమస్యలపై స్థానికంగానే సంప్రదింపులు జరిపేందుకు, సంబంధిత ప్రక్రియలను వేగవంతం చేసేందుకు వీలుంటుంది. భూ సంబంధిత వివాదాలు, రెవెన్యూ రికార్డుల సమస్యలు, ధ్రువీకరణ పత్రాల జారీలో ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులు తగ్గే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆదివాసీలు, నిరుపేద రైతులు, మహిళలు, వృద్ధులకు ఈ ఏర్పాటు ప్రయోజనకరంగా మారుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అయితే డివిజన్ ఏర్పాటు సాధ్యాసాధ్యాలు, పరిపాలనా అవసరాలను ప్రభుత్వం సమగ్రంగా పరిశీలించాల్సి ఉంది. జైనూర్ రెవెన్యూ డివిజన్ డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకంగా మారనుంది. ఏజెన్సీ ప్రాంత భౌగోళిక పరిస్థితులు, ప్రజల రవాణా ఇబ్బందులు, పరిపాలనా అవసరాలను పరిగణనలోకి తీసుకొని ఈ ప్రతిపాదనపై సానుకూలంగా స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజాప్రతినిధులు ఈ అంశాన్ని శాసనసభలో ప్రస్తావించడంతో పాటు జిల్లా యంత్రాంగం ద్వారా అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయించేందుకు చొరవ చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు. నాలుగు మండలాల ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చే దిశగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందా? లేక ఏజెన్సీ ప్రజల సుదూర ప్రయాణాలు కొనసాగాల్సిందేనా? అన్నది వేచి చూడాలి.80 కిలోమీటర్ల ప్రయాణం తప్పుతుందిః ఆత్రం అనిల్‌కుమార్, లింగాపూర్ మండల నాయకుడులింగాపూర్ నుంచి ఆసిఫాబాద్‌కు వెళ్లాలంటే సుమారు 80 కిలోమీటర్ల ప్రయాణించాల్సి వస్తోంది. ఒక పని కోసం రెండు, మూడు రోజులు తిరగాల్సిన పరిస్థితి ఉంది.నాలుగు మండలాల పరిధిలోని నిరుపేద రైతులు, వృద్ధులు, మహిళలకు జైనూర్ రెవెన్యూ డివిజన్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ప్రజాప్రతినిధులు ఈ ప్రజా ఆకాంక్షను నెరవేర్చేందుకు కృషి చేయాలి. జైనూర్‌లో డివిజన్ కేంద్రం ఏర్పాటు చేస్తే నాలుగు మండలాల ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది. ప్రజల అవసరాలను గుర్తించి ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలి.

నడిరోడ్డుపై కొట్టుకున్న బంగారం వ్యాపారులు!

ప్రజాపక్షం/ముత్తారం : పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ చౌరస్తాలో గురువారం మధ్యాహ్నం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఇక్కడి చౌరస్తాలో పక్కపక్కనే గోల్డ్ షాపులు నడుపుతున్న ఇద్దరు అన్నదమ్ములు కస్టమర్లను లాక్కునే క్రమంలో నడిరోడ్డుపై వీధి రౌడీల్లా కొట్టుకున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, అమాయకులను మోసం చేస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ దందాపై విచారణ జరపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కాగా, ఈ ఘర్షణపై ఇద్దరు వ్యాపారులు ఒకరిపై ఒకరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నట్లు సమాచారం.

ఎవరెస్ట్ బేస్ క్యాంప్ విజయవంతం

ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ : జగిత్యాల రూరల్ మండలం చెల్గల్ గ్రామానికి చెందిన ఇప్పల ప్రకాష్ ప్రపంచ ప్రఖ్యాత ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌ను విజయవంతంగా చేరుకుని గ్రామానికి గర్వకారణంగా నిలిచారు. సముద్ర మట్టానికి 5,364 మీటర్ల (17,598 అడుగుల) ఎత్తులో ఉన్న ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌ను చేరుకోవడం సాధారణ విషయం కాదు. వర్క్ ఫ్రమ్ హోమ్ విధానంలో ఉద్యోగం చేస్తూ తన వ్యక్తిగత ఆసక్తులు,లక్ష్యాలకు సమయం కేటాయించి ఎవరెస్ట్ బేస్ క్యాంప్ వరకు ప్రయాణించడం యువతకు ఆదర్శంగా నిలుస్తోంది. ఇప్పల ప్రకాష్‌ను అభినందించిన చెల్గల్ గ్రామ చెల్గల్ గ్రామానికి చెందిన యువకుడు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌ను చేరుకోవడం గ్రామ ప్రజలందరికీ గర్వకారణమని చెల్గల్ గ్రామ సర్పంచ్ పేర్కొన్నారు. ఉద్యోగ బాధ్యతలను నిర్వహిస్తూనే తన అభిరుచికి ప్రాధాన్యతనిస్తూ ఇంతటి సాహసయాత్రను విజయవంతం చేయడం అభినందనీయమన్నారు.

గిరిజన కళల ప్రోత్సాహానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు

డిసిసి అధ్యక్షురాలు ఆత్రం సుగుణ

ప్రజాపక్షం / కెరమెరి ః ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని డిసిసి అధ్యక్షురాలు ఆత్రం సుగుణ అన్నారు. గురువారం కెరమెరి మండలం కరంజివాడ (గోండ్ గూడ) గ్రామంలో నిర్వహించిన గుస్సాడి, దండారి వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. గ్రామానికి చేరుకున్న ఆమెకు ఆదివాసీ సంప్రదాయ పద్ధతిలో డోలు వాయిద్యాల నడుమ గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు ఎంతో విశిష్టమైనవని, వాటిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. గుస్సాడి, దండారి వంటి ప్రాచీన గిరిజన కళలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించిందని తెలిపారు. ఆదివాసీల కళలు అంతరించిపోకుండా కాపాడుతూ, కళాకారులకు ప్రోత్సాహం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గిరిజనుల అభ్యున్నతితో



పాటు వారి అస్తిత్వం, సంస్కృతి పరిరక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అనంతరం గ్రామస్తులు ప్రదర్శించిన గుస్సాడి, దండారి నృత్యాలను ఆమె తిలకించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బల్వంత్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుజాయిత్ ఖాన్, ఉపాధ్యక్షుడు సిడాం జగన్నాథరావు, మాజీ సర్పంచ్ శంకర్ నాయక్, మాజీ ఎంపిటిసి సిడాం తిరుపతి, నాయకులు దేవిదాస్, జల్పత్ రావు, కుమ్రం దేవేందర్, అయ్యూబ్ ఖాన్, ఆదివాసీ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతాల్లో 1/70 చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలి

ప్రజాపక్షం / వాంకిడిః ఐదో షెడ్యూల్ పరిధిలోని గిరిజన ప్రాంతాల్లో 1/70 చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేసి ఆదివాసీల భూములను కాపాడాలని నాయకులు డిమాండ్ చేశారు. గురువారం వాంకిడి మండలం దొడ్డిగూడ చౌరస్తాలో కొమురం సూరు 29వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కొమురం సూరు విగ్రహాన్ని దొడ్డిగూడ సర్పంచ్ మడావి నాగోరావ్ ఆవిష్కరించారు. అంతకు ముందు గిరిజన సంప్రదాయాల ప్రకారం జెండా ఆవిష్కరణ చేసి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆదివాసీలకు జల్, జంగల్, జమీన్‌పై సంపూర్ణ హక్కులు కల్పించాలనే



లక్ష్యంతో కొమురం భీం, కొమురం సూరు ఉద్యమాలు సాగించారని గుర్తు చేశారు. వారి పోరాటాల ఫలితంగానే 1/70 చట్టం, పీసా చట్టం, అటవీ హక్కుల చట్టాలు వచ్చాయని తెలిపారు. గిరిజనుల హక్కులకు భంగం కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, కొమురం సూరు ఆశయాల సాధనకు ఆదివాసీలంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దొడ్డిగూడ సర్పంచ్ మడావి నాగోరావ్, కొలాం సేవా సంఘం జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు సిడం అన్నిగ, మండల గౌరవ అధ్యక్షుడు కొమురం పగ్గు, ఉపాధ్యక్షుడు ఆత్రం రాము, రాయ్ సెంటర్ మండల సార్మెడి సోయం భీంరావ్, దాబా సర్పంచ్ కోట్నాక జంగు, చిచ్చుపల్లి మాజీ సర్పంచ్ కొర్వెత జంగు, దొడ్డిగూడ పటేల్ కొమురం లేతు, ఎనగొంది పటేల్ మడావి సోనేరావ్, నాయకులు కొమురం భీంరావ్, కొమురం లింగు, కొమురం మారుతి, ఆత్రం ఆనంద్ రావు, ఆత్రం భీంరావ్, ఆత్రం తుకారాం పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అర్చరీ పోటీలకు యశ్వంత్ ఎంపిక

ప్రజాపక్షం/సుల్తానాబాద్ ః మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా శామీర్ పేట్ లోని తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో తెలంగాణ స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ ఎస్ జి ఎఫ్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన అండర్19 ఇంటర్ డిస్ట్రిక్ట్ ఆర్చరీ2026 పోటీలలో సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి టి.యశ్వంత్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని కళాశాల స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ కె. సునీల్ కుమార్ తెలిపారు.మహారాష్ట్రలోని అమరావతి వేదికగా డిసెంబర్ 16 నుండి 19 వరకు జరగనున్న జాతీయ స్థాయి (ఎస్ జి ఎఫ్ అండర్19) ఆర్చరీ పోటీలలో యశ్వంత్ తెలంగాణ రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించి పాల్గొననున్నారు.ఈ సందర్భంగా జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థి యశ్వంత్‌ను కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సి.హెచ్. ప్రభాకర్ ప్రత్యేకంగా అభినందించారు.యశ్వంత్ తన అద్భుతమైన ప్రతిభతో కళాశాలకు,మన ప్రాంతానికి ఎంతో గర్వకారణంగా నిలిచారని కొనియాడారు.జాతీయ స్థాయి పోటీలలో కూడా పతకం సాధించి,మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం సిబ్బంది విద్యార్థి యశ్వంత్‌ను అభినందించి, జాతీయ పోటీలకు శుభాకాంక్షలు తెలిపారు.

అభివృద్ధిని ఓర్వలేకే ఎంపి వంశీకృష్ణపై కుట్రపూరిత విమర్శలు

ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్ ః పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ గడ్డం వంశీకృష్ణపై రాజకీయ దురుద్దేశంతో కొందరు వ్యక్తులు చేస్తున్న నిరాధార ఆరోపణలను, అసభ్యకర వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని నేతకాని మహర్ సేవా సంఘం,సమతా సైనిక్ దళ్ నాయకులు స్పష్టం చేశారు.జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం స్వామి నేతకాని,వర్కింగ్ ప్రెసిడెంట్ జుమ్మడి కుమార్,సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దుర్గం నగేష్,భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు మౌల్కర్ ప్రేమ్ కుమార్ మాట్లాడుతూఎంపీగా గెలిచిన నాటి నుంచి వంశీకృష్ణ నియోజకవర్గ ప్రగతికి విశేషంగా కృషి చేస్తున్నారని వారు తెలిపారు.మంచిర్యాలలో నేతకాని భవన నిర్మాణానికి ఎంపీ ల్యాడ్స్ నుంచి కోటి రూపాయల నిధులు కేటాయించారని గుర్తుచేశారు.గెజిట్‌లో నేతాని అని తప్పుగా ఉన్న పదాన్ని నేతకాని గా సవరించేందుకు రాష్ట్ర,కేంద్ర గెజిట్లలో ఆయన తీవ్ర కృషి చేస్తున్నారని వివరించారు. సంఘం రాష్ట్ర నాయకులు సోదరి తిరుపతి, ఉపాధ్యక్షులు కొత్తపల్లి గంగేష్,జాడి రాజేష్, మంచిర్యాల జిల్లా అధ్యక్షులు గోమస శ్రీకాంత్,కోశాధికారి దుర్గం చరణ్ దాస్, సీనియర్ నాయకులు సల్లూరి కిష్టయ్య, నాయకురాళ్ల జాడి కల,సేగ్గం చంద్రమ్మ,గవ్వల అనితలతో పాటు పలు దళిత సంఘాల నాయకులు,మహిళలు,తదితరులు పాల్గొన్నారు.

400 కిలోమీటర్ల సైకిల్ యాత్ర విజయవంతం

ప్రజాపక్షం/పెద్దపల్లి ః మేడిగడ్డ నుంచి కొండపోచమ్మ సాగర్ వరకు సుమారు 400 కిలోమీటర్ల సైకిల్ యాత్రను విజయవంతంగా పూర్తి చేసి పెద్దపల్లికి చేరుకున్న బీఆర్ఎస్ పార్టీ సైకిల్ యాత్ర బృందానికి పెద్దపల్లి మాజీ శాసనసభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ దాసరి మనోహర్ రెడ్డి తన స్వగృహంలో ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా సైకిల్ యాత్ర ఉప్పు రాజ్ కుమార్ బృంద సభ్యులైన కాశీపాక వాసు, సురేష్, లక్ష్మణ్‌లకు పూలమాలలు వేసి, శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో యువ నాయకులు దాసరి ప్రశాంత్ రెడ్డి కూడా పాల్గొని యాత్ర బృంద సభ్యులను అభినందించారు.తెలంగాణ ఆత్మగౌరవం,రైతుల సంక్షేమం, ప్రజా ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యంగా మేడిగడ్డ నుంచి కొండపోచమ్మ సాగర్ వరకు సుమారు 400 కిలోమీటర్ల మేర చేపట్టిన ఈ సైకిల్ యాత్ర విజయవంతంగా పూర్తిచేయడం అభినందనీయమని దాసరి మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై పోరాటం చేయాలనే సంకల్పం, రైతుల పట్ల ఉన్న నిబద్ధత, ఉద్యమ స్ఫూర్తికి ఈ యాత్ర నిదర్శనమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మార్కు లక్ష్మణ్, కౌన్సిలర్ వెన్నం సుజాత రవీందర్, ఓదెల నాయకులు, సుల్తానాబాద్ పట్టణ అధ్యక్షుడు గుణపతి, టీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కొయ్యడ సతీష్, సురేష్, పుదరి చంద్రశేఖర్, ముత్యాల రాజయ్య, గుర్రాల శ్రీను, గోపి, శ్రీనివాస్, నాగరాజు, మధు తదితర బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సైకిల్ యాత్ర బృంద సభ్యులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో కూడా రైతులు,ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఇదే పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

మార్షల్ ఆర్ట్స్ అంటే జీవన కళ

ప్రజాపక్షం/ఖానాపూర్ : నేటి సమాజంలో మార్షల్ ఆర్ట్స్ కేవలం ఆత్మరక్షణ కోసమే కాకుండా విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఏకాగ్రత, పట్టుదల,శారీరక దృఢత్వాన్ని పెంపొందించే అద్భుతమైన జీవన కళ అని మస్కాపూర్ ప్రధానోపాధ్యాయులు జాడి శ్రీనివాస్ తెలిపారు.గురువారం పాఠశాల 10వ తరగతి విద్యార్థి, గిన్నిస్ రికార్డు విజేత తుర్క అర్షిత్ రెడ్డి, ఆయన తండ్రి ముత్యం రెడ్డి, కరాటే మాస్టర్ ఆరిఫ్ ఖాన్ లను సన్మానించి అనంతరం ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడారు.ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి విద్యార్థి, ప్రత్యేకించి బాలబాలికలు కరాటే వంటి మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం విద్యార్థి తండ్రి ముత్యం రెడ్డితో పాటు అర్షిత్ రెడ్డిని ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయ బృందం ఘనంగా శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందించి అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నరేందర్, శంకర్, శేఖర్, అంజయ్య, ఇమ్రాన్, శోభారాణి, బాలల రక్షణ అధికారిణి దీప్తి, చందన, సయ్యద్ ఫరాజ్, షఫీ, శ్రీనివాస్, కిషన్ ప్రసాద్, లక్ష్మణ్ రావు, విజయ్,రవి, వినోద్ రాజ్, ధర్మయ్య, స్వప్న, గంగాధర్, రమేష్, ఝాన్సీ, సృజన, తదితరులు పాల్గొన్నారు.

పలువురిని పరామర్శించిన ఎమ్మెల్యే



ప్రజాపక్షం/లోకేశ్వరం : లోకేశ్వరం మండలంలోని కనకాపూర్ గ్రామంలో మాజీ సర్పంచ్ చిన్న గంగాధర్,దెబ్బడి పోశెట్టి లు అనారోగ్యంగా ఉండడంతో ఎమ్మెల్యే రామారావు పటేల్ వారిని పరామర్శించి మనోధైర్యాన్ని తెలిపి పలు సూచనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ సిందే సునీల్,మండల బిజెపి నాయకులు పాల్గొన్నారు.

జడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయుల సమావేశం



ప్రజాపక్షం/లోకేశ్వరం : లోకేశ్వరం మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో హెడ్మాస్టర్ అరుణ మరియు ఎస్సీ హాస్టల్ బీసీ హాస్టల్ వార్డెన్ లతో తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా హెడ్మాస్టర్ అరుణ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు పలు సూచనలు తెలియజేశారు.విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలని,ఉపాధ్యాయులు చెప్పింది వినాలని ఉపాధ్యాయులు చెప్పింది వింటే విద్యార్థులు భవిష్యత్తులో రాణిస్తారని క్రమశిక్షణ విద్యార్థి దశ నుండే విద్యార్థుల దిశ మార్చుకోవాలని విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఉపాధ్యాయులు చెప్పింది విని చదువులో రాణించి రాష్ట్రానికి దేశానికి కీర్తి ప్రతిష్టలు తేవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించకుంటే నిరవధిక సమ్మె



ప్రజాపక్షం/నిర్మల్‌టౌన్ : ఆశా వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నెలకు రూ.18 వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు సమ్మె నోటీసు అందజేశారు.ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మన సురేష్ మాట్లాడుతూ ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏళ్ల తరబడి ప్రభుత్వానికి వినతిపత్రాలు అందజేస్తున్నప్పటికీ స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ వారి శ్రమకు తగిన వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఆశా వర్కర్లకు నెలకు రూ.18 వేల వేతనం చెల్లిస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ఈ మేరకు జీవో నంబర్ 6 తీసుకువచ్చినప్పటికీ ఐదు నెలలు గడుస్తున్నా అమలుకు నోచుకోకపోవడం విచారకరమన్నారు. హామీలను కాగితాలకే పరిమితం చేయకుండా తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలని, వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అదేవిధంగా బీమా సౌకర్యం, ఇతర ప్రభుత్వ ఉద్యోగులకు లభించే ప్రయోజనాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆశా వర్కర్ల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త జేఏసీ పిలుపు మేరకు డిసెంబర్ 15 నుంచి నిరవధిక దీర్ఘకాలిక సమ్మె చేపడతామని బొమ్మన సురేష్ హెచ్చరించారు.ఆశా వర్కర్ల హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

గ్రామంలో రైతులకు అవగాహన సదస్సు



ప్రజాపక్షం/దిలావర్‌పూర్ : మండలంలోని గుండంపల్లి గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రైతు పొలాల్లోకి ఆవిష్కరణలు అనే వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు.తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త శ్రీ కె. రాహుల్ విశ్వకర్మ,ముధోల్ వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ ఆకుల్ల దినేష్ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ సదస్సు జరిగింది.గత దశాబ్దపు సాంకేతికతల క్రోడీకరణప్రస్తుత రబీ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని,గత పదేళ్లుగా అభివృద్ధి చేసిన వ్యవసాయ సాంకేతికతలను రైతులకు చేరువ చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టారు.

ఇందులో భాగంగా : మేలైన, అధిక దిగుబడినిచ్చే విత్తన రకాల ఎంపిక.సమగ్ర చీడపీడల నివారణ మరియు యాజమాన్య పద్ధతులు.భూసార పరీక్షల ప్రాముఖ్యత మరియు ఎరువుల సమతుల్య వినియోగం.ఆధునిక వ్యవసాయ యాంత్రీకరణ మరియు నూతన సాంకేతిక పరిజ్ఞానంపై రైతులకు అవగాహన కల్పించారు.ఎల్‌నినో ప్రభావం – ఆరుతడి పంటలే శ్రేయస్కరంసదస్సులో శ్రీ రాహుల్ విశ్వకర్మ మరియు డాక్టర్ దినేష్ మాట్లాడుతూ... ప్రస్తుత వాతావరణంలో తీవ్రమైన ఎల్‌నినో ప్రభావం కనిపిస్తున్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.నీటి లభ్యత తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున, ఎక్కువ నీరు అవసరమయ్యే వరి పంటకు బదులుగా ఆరుతడి పంటలైన జొన్న, సజ్జ, పెసర, మినుము, శనగ వంటి పంటలను సాగు చేసుకోవాలని కోరారు.ప్రముఖులుఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు రాజశేఖర్ రెడ్డి, గుండంపల్లి వ్యవసాయ విస్తరణ అధికారి, స్థానిక ఆదర్శ/అభ్యుదయ రైతులు మరియు గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గోదాం నిర్మాణానికి మార్కింగ్ పనులు ప్రారంభం



ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ : నిర్మల్ రూరల్ మండలంలోని కౌట్ల(కే) గ్రామంలో నూతనంగా నిర్మించనున్న గోదాం నిర్మాణానికి సంబంధించి మార్కింగ్ పనులు నిర్వహించారు. గ్రామంలో వ్యవసాయ అవసరాలకు ఉపయోగపడేలా గోదాం నిర్మాణం చేపట్టేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు స్థలాన్ని పరిశీలించి మార్కింగ్ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దుమాల రాజు, పంచాయతీరాజ్ శాఖ ఏఈ దేవదాస్, గ్రామాభివృద్ధి కమిటీ (వీడీసీ) అధ్యక్షుడు దేవేందర్ రెడ్డి,కార్యదర్శి లక్ష్మణ్, విశ్రాంత ఇంజినీర్ జగదీష్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే వీడీసీ సభ్యులు నర్సారెడ్డి, వార్డు సభ్యులు,ఇతర కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు హాజరయ్యారు.ఈ సందర్భంగా గ్రామంలో గోదాం నిర్మాణం పూర్తయితే రైతులకు,గ్రామ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టి త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అభిప్రాయపడ్డారు.గ్రామ అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, గ్రామ కమిటీ సభ్యులు, ప్రజలు సమష్టిగా కృషి చేయాలని తెలిపారు.గ్రామ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతూ కౌట్ల(కే) గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

దోపిడీ వ్యవస్థ నిర్మూలనకు పోరాడాలి



అమరవీరుల ఆశయ సాధనకు ఎర్రజెండా స్ఫూర్తితో ముందుకు సాగాలి

ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ : దోపిడీ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం అమరవీరులు సాగించిన పోరాట స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథా పార్టీ నిర్మల్ జిల్లా కార్యదర్శి కె. రాజన్న పిలుపునిచ్చారు. పేద ప్రజల హక్కుల పరిరక్షణ కోసం సాగుతున్న పోరాటాల్లో ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు.నవంబర్ 1 నుంచి 10వ తేదీ వరకు అమరవీరుల సంస్మరణ సభలు నిర్వహించాలని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా గురువారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవనంలో పార్టీ ఆధ్వర్యంలో అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వ్యక్తిగత ప్రయోజనాలను పక్కనపెట్టి పేద ప్రజల సంక్షేమం, సమానత్వం, సామాజిక న్యాయం కోసం పోరాడి అసువులు బాసిన అమరవీరుల త్యాగాలు మరువలేనివన్నారు.అమరవీరులు చూపిన మార్గంలో ప్రజలంతా పయనించాలని,వారు ఆశించిన సమాజ నిర్మాణం కోసం నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. పేదలు, కార్మికులు, కూలీలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సంఘటిత పోరాటాలు కొనసాగించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఈ సంస్మరణ సభలో పార్టీ నాయకులు ఆర్.రామలక్ష్మణ్, గంగాధర్, సత్యం, శివలింగం, రాజేశ్వర్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.



మాసం లక్ష్మీ వెల్ఫేర్ సొసైటీ అధ్వర్యంలో మెగా వైద్య శిబిరం



ప్రజాపక్షం/బోథ్ : బోథ్ మండల కేంద్రంలో మెగా వైద్య శిబిర సందర్భంగా డాక్టర్ నవీన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్క తల్లి తండ్రులు తమ పిల్లల ఆరోగ్య విషయం లో జాగ్రత్త తీసుకోవాలి అని పిల్లల వైద్య నిపుణులు యస్.నవీన్ రెడ్డి అన్నారు గురువారం పట్టణ కేంద్రం కి చెందిన మాసం లక్ష్మి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ నర్సింహా పిల్లల ఆసుపత్రి సహకారం తో లో ప్రభుత్వ పాఠశాల లో చదువుతున్న 350 మంది విద్యార్థుల కు వైద్య పరీక్షలు నిర్వహించారు.వారికి అవసరం ఉన్న మందులు మాసం లక్ష్మి వెల్ఫేర్ సొసైటీ తరుపున ఉచితంగా పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయురాలు రజిత ఉపాధ్యాయులు అనసూయ, బైరి సతీష్, బైరి నవ్యశ్రీ మరియు పంచాయితీ కార్యదర్శి అశోక్, బోథ్ మేజర్ గ్రామ పంచాయితీ సర్పంచ్ అన్నపూర్ణ మహేందర్ ,ఉప సర్పంచ్ విజయలక్ష్మి సన్నీ, వార్డ్ సభ్యులు షేక్ షాకీర్, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ లోస్రం రాజశేఖర్,తౌటు అన్వేష్, ఆసుపత్రి సిబ్బంది శ్రవణ్ కుమార్, దుర్గ ప్రసాద్, సతీష్, మాసం లక్ష్మి , వెల్ఫేర్ సొసైటీ సభ్యులు సోమన్‌పెల్లి అరుణ్ రాజ్, సిలువేరి బన్నీ మరియు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

లీగల్ మెట్రాలజీ అధికారుల మెరుపు తనిఖీలు

తూనికలు, కొలతల్లో అక్రమాలు..8 వ్యాపార సంస్థలపై కేసులు నమోదు



ప్రజాపక్షం /ఖానాపూర్ : ఖానాపూర్ పట్టణ కేంద్రంలో గురువారం తూనికలు,కొలతల శాఖ (లీగల్ మెట్రాలజీ) అధికారులు పలు వ్యాపార సంస్థలపై ఆకస్మికంగా మెరుపు తనిఖీలు నిర్వహించారు.సివిల్ సప్లై కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి పి.శంకర్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా పట్టణంలోని పలు వ్యాపార సంస్థలను తనిఖీ చేయగా, కొన్ని దుకాణాల్లో తూనికలు,కొలతల్లో లోపాలు ఉన్నట్లు, ధరల పట్టికలు (ప్రైస్ లిస్ట్) ప్రదర్శించకపోవడం వంటి నిబంధనల ఉల్లంఘనలు గుర్తించారు.ఈ తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘించిన రెండు రైస్ మిల్లులు,మూడు రైస్ షాపులు,రెండు కిరాణా దుకాణాలు, ఒక మొబైల్ షాపుతో కలిపి మొత్తం ఎనిమిది వ్యాపార సంస్థలపై కేసులు నమోదు చేసినట్లు జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి పి. శంకర్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారస్తులందరూ ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, వినియోగదారులకు సరైన తూనికలు, కొలతలతో వస్తువులు విక్రయించాలని సూచించారు. ప్రతి దుకాణంలో ధరల పట్టికను స్పష్టంగా ప్రదర్శించాలని ఆదేశించారు.నిబంధనలు ఉల్లంఘించే వ్యాపార సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉపాధి హామీ పనులు కల్పించాలి

ప్రజాపక్షం/ఖానాపూర్ : పట్టణాలలో ఉపాధి హామీ పనులు కల్పించాలని,గ్రామీణ ప్రాంతాలలో వెంటనే పనులు ప్రారంభించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రధాన డిమాండ్లు సంవత్సరానికి 200 రోజులు పని దినాలు కల్పించాలి.కోరిన ప్రతి ఒక్కరికి జాబ్ కార్డు ఇవ్వాలి.సంవత్సరానికి రెండు లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించాలి.రోజు కూలి 800 రూపాయలు చెల్లించాలి. పట్టణాలలో కూడా ఉపాధి హామీ పనులు కల్పించాలి.గ్రామీణ ప్రాంతాలలో వెంటనే పనులు ప్రారంభించాలి.ఈ డిమాండ్ల సాధన కోసం శుక్రవారం హైదరాబాద్ లోని సీఆర్డీ కార్యాలయం ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి, జిల్లా ఉపాధ్యక్షులు సుంచుల నారాయణ వ్యవసాయ కూలీలకు పిలుపునిచ్చారు.వ్యవసాయ కూలీలు,ఉపాధి హామీ కార్మికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ధర్నాను విజయవంతం చేయాలని వారు కోరారు.